RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :61 శుక్రవారం 29 మే 2026 పేజీలు -8 వెల రూ 5-00

## భారత మామిడి పండ్ల దిగుమతులపై జపాన్ నిషేధం

**న్యూఢిల్లీ, మే 28:** భారత మామిడి ఎగుమతిదారులకు జపాన్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఈ సీజన్‌కు గాను భారత మామిడి పండ్ల దిగుమతులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లోని క్రిమిసంహారక కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవని జపాన్ తనిఖీ బృందం గుర్తించడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ పరిణామంతో మామిడి ఎగుమతిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని రెహ్మాన్‌పూర్‌లో ఉన్న ఒక ప్లాంట్‌లో వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ (వీహెచ్ టీ) ప్రక్రియలో లోపాలు ఉన్నట్లు జపాన్ అధికారులు గుర్తించారు. పండ్లను తెగుళ్లు, కీటకాల నుంచి రక్షించడానికి ఈ ప్రక్రియ చాలా కీలకం. ఈ నేపథ్యంలో, మార్చి 2 తర్వాత జారీ చేసిన భారతీయ సర్టిఫికెట్లతో వచ్చే మామిడి షిప్‌మెంట్‌లను అంగీకరించబోమని జపాన్‌కు చెందిన యొకోహామా ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ నిషేధం కారణంగా కేసర్, అల్ఫాన్సో, లంగ్రా, బంగినపల్లి వంటి ప్రసిద్ధ రకాల ఎగుమతులు నిలిచిపోయాయి. భారత మామిడి ఎగుమతిదారులు ఇప్పటికే పలు సవాళ్లతో సతమతమవుతున్నారు. పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఎగుమతులు 20-30 శాతం పడిపోయాయి.

రిపోర్టర్లు కావలెను
ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను
సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.
ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## చివరి గింజవరకు కొనుగోలు



## ఈ ప్రరభుత్వం రైతు పక్షపాతి:మంత్రి ఉత్తమ్

**యాదాద్రి భువనగిరి:** భువనగిరి యాదాద్రి జిల్లా వంగపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఐ. టి పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,రెవిన్యూ సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్ లు సందర్శించారు తరువాత సమీపంలోని రామాజిపేట వద్ద ప్రభుత్వ గోదాములలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని పరిశీలించారు ఈ కార్యక్రమంలో భోనగిరి లోకసభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,శాసన సభ్యులు కుంభం అనిల్ రెడ్డి,వేముల వీరశం,పౌర సరఫరాల శాఖాకమిషనర్ స్టీఫెన్ రవీంద్ర కలెక్టర్,డి.సి.పి తదితరులు పాల్గొన్నారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటాం ఆందోళన చెందకండి. ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని అన్నారు. ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోంది. రాజకీయాల కోసమే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఉచ్చులో తెలంగాణా రైతాంగం చిక్కొద్దు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. 10097 వేల కోట్లు రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసింది. రబీ సీజన్లో ఇంతటి దిగుబడి రావడం సరికొత్త రికార్డ్ గా నమోదైంది. కొనుగోళ్లలోను రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త రికార్డ్ సృష్టిస్తుంది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగా అనుకూల విధానాల తోటే ఇంతటి దిగుబడి, కొనుగోళ్ళు జరుగుతున్నాయి. చివరి గింజవరకు కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది. ఇందులో ఎటువంటి అపోహలకు ఆస్కారమే లేదు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి సత్వరమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నాం. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. రైతాంగానికి నష్టం వాటిల్లే ఏ చర్యను ప్రభుత్వం సమర్ధించదని అన్నారు.

## ఫ్యూచర్ సిటీ దేశానికి ఆదర్శం కానుంది

### మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతుందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. దేశంలోనే అత్యుత్తమ మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర అభివృద్ధి ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు.

## కేటీఆర్ వ్యూహాత్మక మౌనమా..?



**హైదరాబాద్, మే 28:** ఎమ్మెల్యేగా.. ఎంపీగా.. కేంద్ర మంత్రిగా.. ఉద్యమ నాయకుడిగా.. ముఖ్యమంత్రిగా.. ప్రతిపక్ష నాయకుడిగా.. ఇలా అనేక పాత్రలను పోషించారు కేసీఆర్. సుదీర్ఘ రాజకీయ అనుభవంలో కేసీఆర్ ఎన్నో ఆటుపోట్లను చవిచూశారు. ఉద్యమ సమయంలో అనేక రకాల విమర్శలు ఎదుర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా 10 సంవత్సరాలపాటు రాష్ట్రాన్ని పరిపాలించారు.. 2023 ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో ఆయన ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగుతున్నారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో 0 సీట్లు వచ్చినప్పటికీ.. స్థానిక సంస్థల ఎన్నికల్లోను ఆశించిన స్థాయిలో స్థానాలు లభించకపోయినప్పటికీ.. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల్లో నమ్మకం కోల్పోకుండా ఉండేందుకు కేసీఆర్ అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు.. పార్టీ 25 సంవత్సరాల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇటీవల జగిత్యాల సభలో సూపర్ స్పీచ్ తోకట్టుకున్నారు. పార్టీకి మళ్ళీ జవసత్వాలు అందించేందుకు కెసిఆర్ కృషి చేస్తున్నారు. అంతేకాదు ఇప్పుడు పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదును కూడా ప్రారంభించారు. ఇప్పటికే అన్ని జిల్లాల బాధ్యులతో కేసీఆర్ మాట్లాడారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఎక్కువ శాతం ఆయన వ్యవసాయ క్షేత్రానికి పరిమితం అవుతారు. ఆయనకు వ్యవసాయం అంటే చాలా ఇష్టం. పైగా గజ్వేల్ ప్రాంతంలో ఆయనకు విస్తారమైన వ్యవసాయ క్షేత్రం ఉంది. అందులో ధాన్యం పంటలు.. వాణిజ్యం పంటలు అన్ని పండుతాయి. క్యాప్సికం.. ముల్లంగి.. స్ట్రాబెరీ.. ఇంకా రకరకాల పంటలు అందులో సాగు చేస్తూ ఉంటారు. ప్రస్తుతం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో వరి కోతలు సాగుతున్నాయి. దీనికి సంబంధించి - మిగతా5లో

## పంచాయితీలకు నిధుల వరదేనా..?




**మెదక్, మే 28:** గ్రామపంచాయతీలు ఆర్థికంగా బలంగా ఉంటేనే దేశం బాగుంటుంది. ఎందుకంటే మన దేశానికి పల్లెలే పట్టు కొమ్మలు కాబట్టి. దురదృష్టవశాత్తు గ్రామీణ ప్రాంతాలను ఇప్పటికి ప్రభుత్వాలు కేవలం ఆదాయం వచ్చే వనరులుగానే చూస్తున్నాయి. ఆదాయాన్ని తీసుకొని అంతంతమాత్రంగా కేటాయింపులు జరుపుతూ.. అభివృద్ధి విషయంలో శీత కన్ను ప్రదర్శిస్తున్నాయి. అందువల్లే గ్రామాలు అభివృద్ధికి నోచుకోకుండా పోతున్నాయి. తెలంగాణలో గడచిన పది సంవత్సరాల కాలంలో గ్రామపంచాయతీలపై భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం విపరీతమైన పెత్తనం సాగించింది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసింది. దీంతో పంచాయతీలలో బకాయిలు పేరుకుపోయాయి. పంచాయతీల మీద ట్రాక్టర్లు.. ఇతర ఖర్చులను వేయడంతో.. బకాయిలు గుదిబండ లాగా మారిపోయాయి. దీంతో కనీసం పంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వచ్చే ఆదాయం మీద హక్కు లేకుండా - మిగతా5లో



## ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే

### మంత్రి కోమటిరెడ్డి

**నల్గొండ, మే 28 :** బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి మాట్లాడారు. బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో' యాత్ర చేపట్టారని ప్రస్తావించారు. అన్నివర్గాలు, అన్నిమతాల ప్రజలు సమానమేనని, అందరు కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో 'భారత్ జోడో' యాత్ర చేశారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అనడానికి ఇది ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. నల్గొండలో మతసామరస్యానికి, గంగా - జమునా - తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ లో ఇంటిదొంగలు..

**హైదరాబాద్, మే 28:** ఇది కొత్తేమీ కాదు. కాంగ్రెస్ పార్టీలో అనాదిగా వస్తున్న సంప్రదాయమే. అందరికీ తెలిసినట్టుగానే ఆ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం అధికంగా ఉంటుంది. ఒకరి పొడ ఒకరికి గిట్టదు. ఒకరు ఎదిగితే ఇంకొకరు తట్టుకోలేరు. స్థూలంగా చెప్పాలంటే పరమపద సోపానం అనేది కాంగ్రెస్ పార్టీలో అణువణువు కనిపిస్తూనే ఉంటుంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో కొత్తగా మారింది లేదు. కొత్తగా ఆ పార్టీలో అలవడిన క్రమశిక్షణ కూడా లేదు. ఇటీవల పీసీసీ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మీద బిగ్ టివి ఛానల్ లో వ్యతిరేక కథనాలు ప్రసారమయ్యాయి. ఈ ఛానల్ ముఖ్యమంత్రి కి అత్యంత దగ్గరగా ఉన్న వ్యక్తులదని తేలింది. కాంగ్రెస్ పార్టీకి బిగ్ టివి మొదటినుంచి కూడా సపోర్ట్ చేసుకుంటూ వస్తోంది. ఒక్క నెగిటివ్ స్టోరీ కూడా అందులో పబ్లిష్ కాలేదు. పబ్లిష్ అయ్యే అవకాశం కూడా లేదు. అయితే ఉన్నట్టుండి ఆ ఛానల్ లో మహేష్ కుమార్ గౌడ్ మీద నెగిటివ్ స్టోరీలు టెలికాస్ట్ కావడం నిజంగానే సంచలనం కలిగించింది. మహేష్ కుమార్ గౌడ్ వ్యవహార శైలి మీద బిగ్ టీవీ అలాంటి స్టోరీలు టెలికాస్ట్ చేయడం నిజంగానే ఒక రకమైన దిగ్భ్రాంతిని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో కలిగించింది. అసలు మహేష్ కుమార్ గౌడ్ కు.. బిగ్ టి వి యాజమాన్యానికి ఎక్కడ తేడా వచ్చిందో అర్థం కావడం లేదు.. తెర వెనుక ఎలాంటి వివాదాలున్నా సరే.. - మిగతా5లో

## ఈటెల, డీకేలలో ఎవరికి పదవి

**హైదరాబాద్, మే 28:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం త్వరలోనే భారీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, తెలంగాణ బీజేపీ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. రాష్ట్రం నుంచి ఎవరికి కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కబోతోంది? ఎవరి పదవి ఊడనుంది? ఎవరికి కొత్త బాధ్యతలు రానున్నాయి? అనే అంశాలపై సర్వత్రా ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుత సమీకరణాల ప్రకారం.. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రివర్గంలో ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ల పదవులకు ప్రస్తుతానికైతే ఎలాంటి ఢోకా లేదని ఢిల్లీ వర్గాల సమాచారం. అయితే, వారి శాఖల్లో మార్పులు చేర్పులు ఉండే అవకాశం ఉంది. కేంద్రంలో కిషన్ రెడ్డి పరపతి రోజురోజుకూ పెరుగుతోంది. అధిష్టానం వద్ద ఆయన మాటకే కీలక ప్రాధాన్యత లభిస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక నుంచి మంత్రుల కోటా వరకు ఆయన అభిప్రాయం కీలకంగా మారింది. అయితే, మరోవైపు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పదవిపై వస్తున్న ఊహాగానాలకు అధిష్టానం చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. కొడుకు వివాదం నేపథ్యంలో మంత్రి పదవి నుంచి తొలగిస్తారనే ప్రచారం సాగినప్పటికీ, అధిష్టానం బండి జోలికి వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. గతంలో ఆయనను రాష్ట్ర అధ్యక్ష - మిగతా5లో

## సంపాదకీయం

# తెలుగు రాష్ట్రాల్లో సర్ సెగలు

దేశవ్యాప్తంగా పలు వివాదాలతో సంచలనం రేపుతున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) సెగ ఇక తెలుగు రాష్ట్రాలకు తాకనుంది. వేసవి కాలం ముగిసి తొలకరి రుతుపవనాలు ప్రవేశించే జూన్ నెలలో తెలంగాణలో 'సర్' వేడి మొదలుకానుంది. ఇప్పటికే దేశంలో రెండు దశల్లో ముగిసిన ఓటర్ల జాబితా ప్రక్షాళన తుది మూడో దశలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా మొత్తం 16 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేపట్టనున్నారు. మొదటి రెండు దశల్లో పశ్చిమబెంగాల్, అసోం, బీహార్, తమిళనాడు, కేరళ, రాష్ట్రాల్లో అక్కడి అసెంబ్లీ ఎన్నికల ముందు 'సర్' ప్రక్రియ నిర్వహించడంతో ఎన్నికల్లో కీలకాంశంగా మారింది. ఇప్పుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు చాలా కాలం ఉన్నా రాష్ట్రంలో 'సర్' రాజకీయ వేడి పుట్టించింది. స్వయం ప్రతిపత్తి సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎలాంటి విమర్శలు ఎదుర్కోకుండా నిష్పక్షపాతంగా తెలంగాణలో 'సర్'ను విజయవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర ఓటర్లు కోరుకుంటున్నారు. కాలానుగుణంగా దేశంలో ఓటర్ల జాబితాను ప్రక్షాళించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. దేశంలో ఇంతకుముందు 195152, 1960, 1980, 1993, 1995, 2002 2004 సంవత్సరాల్లో దేశంలో 'సర్' ప్రక్రియ నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను సవరించారు. 2025 26లో భాగంగా తొలుత బీహార్‌లో, అనంతరం 12 రాష్ట్రాల్లో 'సర్' నిర్వహించి, ఇప్పుడు చివరగా 16 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'సర్' చేపట్టేందుకు సిద్ధమైంది. ఓటర్ల జాబితాలో డూప్లికేట్, చనిపోయిన వారు, చిరునామా మారిన వారు, రెండు చోట్ల ఓట్లు ఉన్నావారు, అర్హత లేని వారి పేర్లను తొలగించి ప్రక్షాళన చేయడమే 'సర్' లక్ష్యమని ఎన్నికల సంఘం పదేపదే చెబుతున్నా దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమియేతర పార్టీలు మాత్రం 'సర్' ప్రక్రియను 'ఎంపిక చేసిన ప్రక్షాళన'గా విమర్శిస్తున్నాయి. దీనిపై పలు రాజకీయ పార్టీలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నాయి. 'సర్' ప్రక్రియ ఏ ఒక్క పార్టీకి అనుకూలంగా నిర్వహించడం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత భారత ఎన్నికల సంఘంపైన ఉంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని ఎన్నికల సంఘం చెబుతున్నా తెలంగాణలో రాజకీయ పార్టీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం అధికారులను కలిసి తమ సందేహాలు, సూచనలు తెలియజేస్తున్నారు. పార్టీలు తమ నేతలను, కార్యకర్తలను 'సర్'పై జాగృతం చేశాయి. మొదటి రెండు దశ 'సర్' ప్రక్రియలో దాదాపు 7.2 కోట్ల ఓట్లు తొలగించబడ్డాయి. అదే సమయంలో సుమారు 2 కోట్ల మంది ఓటర్లను చేర్చారు. రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే బీహార్‌లో 65 లక్షలు (8.3%), ఉత్తరప్రదేశ్‌లో 2.5 కోట్లు (13%), తమిళనాడులో 97.3 లక్షలు (14%), పశ్చిమబెంగాల్‌లో 90 లక్షలు (11%), గుజరాత్‌లో 70 లక్షలు (14.5%), మధ్యప్రదేశ్‌లో 34.25 లక్షలు (6%), రాజస్తాన్‌లో 31 లక్షలు (5.7 ఎ), చత్తీస్‌గఢ్ లో 25 లక్షలు (11%) ఓట్లు 'సర్'లో తొలగించారు. మరోవైపు గోవా, లక్షద్వీప్, అండమాన్ నికోబార్‌లో పూర్తి గణాంకాలు వెల్లడి కాలేదు. సర్' ప్రక్రియ చేపట్టిన రాష్ట్రాల్లో ప్రధానంగా బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, అసోంలో వివాదాలు రేగాయి. బీహార్‌లో మొదట కోటి వరకు ఓట్లు తొలగిస్తారనే ప్రచారం జరిగినా రాజకీయ దుమారం, న్యాయస్థానాల జోక్యంతో చివరికి 65 లక్షల ఓట్లు రద్దు అయ్యాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్‌లో 'సర్' దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఉన్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు పారదర్శకత కోసం న్యాయమూర్తులను పరిశీలకులుగా నియమించి ప్రజాస్వామ్యంపై భరోసా కలిగించింది. పలు సందర్భాల్లో ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చింది. పశ్చిమబెంగాల్‌లో బిఎల్‌ఓలపై ఒత్తిడి పెరిగి దురదృష్టవశాత్తు కొంత మంది మరణించిన ఘటనలు కూడా జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల ముగిసిన తర్వాత కూడా ఇంకా పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల తొలగింపు కేసులు న్యాయస్థానాల్లో ఉన్నాయి. తమిళనాడులో నాడు అధికారంలో ఉన్న డిఎంకె 97 లక్షల ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘాన్ని తప్పుపట్టింది. అసోంలో అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల అంశంతో 'సర్' సున్నితంగా మార్చింది. పలు రాష్ట్రాల్లో 'సర్' వివాదాస్పదమైన నేపథ్యం లో తెలంగాణలో కూడా ఎలా జరుగుతుందో అదే ఆందోళన కలగడం సహజమే. తెలంగాణలో 'సర్' నిర్వహణలో భాగంగా 2026 జూన్ 25 నుంచి జూలై 24 వరకు బిఎల్‌ఓలు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను ధ్రువీకరించనున్నారు. జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. తుది జాబితా అక్టోబర్ 1 లేదా అక్టోబర్ 10న విడుదల చేసే అవకాశముంది. రాష్ట్రంలో ఇప్పటికే ర్యాండవ్? మ్యాపింగ్ చేపట్టారు. 2002 ఓటర్ల జాబితాతో సరిపోలుస్తూ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం 3.32 కోట్ల మంది ఓటర్లుండగా ఇప్పటివరకు జరిగిన మ్యాపింగ్ ఆధారంగా 50 లక్షలకుపైగా ఓటర్లు తగ్గవచ్చనే అంచనాలున్నాయి. ఎన్నికల సంఘం రూపొందించిన 'డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్' సాఫ్ట్‌వేర్‌తో బోగస్, డూప్లికేట్, రెండు చోట్ల ఉండే ఓట్లు తొలగించే వీలుంది. ప్రధానంగా గ్రేటర్ శివార్లలో, కొత్త కాలనీల్లో భారీగా ఓట్లు తొలగించడం, జోడించడం జరిగే అవకాశాలున్నాయి. బిఎల్‌ఓలు, ఎన్యూమరేటర్లు రెండు మూడు సార్లు వచ్చి మరీ తనిఖీలు చేసిన తర్వాతనే తుది జాబితాను రూపొందిస్తారు. ఓటరు రిసిప్ట్ కాపీని డిజిటల్ రికార్డులో భద్రపరుస్తారు. ఓటర్లు 11 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తమ రుజువుగా చూపించవచ్చని ఎన్నికల సంఘం ప్రకటించింది ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో 'సర్'లో కేంద్రబిందువుగా మారే అవకాశాలున్నాయి. నగరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఎపి నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన వారితోపాటు ఇతర దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు భారీగా ఉన్నారు. వీరిలో కొందరికి రెండు రాష్ట్రాల్లోనూ ఓట్లుండే అవకాశాలున్నాయి. మ్యాపింగ్‌లో ఓటర్లు కనిపించకపోవడంతో ఇక్కడ 'సర్' ప్రక్రియలో ఓట్లు తొలగింపు వివాదం కావచ్చు. నగరంలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు నకిలీ పత్రాలతో ఓటర్లుగా ఉన్నారనే ఆరోపణలున్న నేపథ్యంలో సదరు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు నెలకొనే అవకాశాలుంటాయి. సున్నిత ప్రాంతాల్లో అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకొని 'సర్'ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే నగరంలో మ్యాపింగ్ చేపట్టడంలో కొన్ని రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోవడంతో అనర్హులు విధులు నిర్వహిస్తున్నరనే ప్రచారం జరుగతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే తెలంగాణలో కూడా 'సర్' వివాదాస్పదమయ్యే అవకాశాలున్నాయి.ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఎన్నికల సంఘంతోపాటు రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పోలింగ్ బూత్ స్థాయిలో అధికారిక బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఒ), రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్ (బిఎల్‌ఎ) పాత్ర క్రియాశీలకమైంది. తెలంగాణలో ఒక్కో బిఎల్‌ఒ పరిధిలో సగటున 930 మంది ఓటర్లున్నారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలోనే ఓటర్ల జాబితా రూపొందిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉంటే వివాదాలు అరికట్టవచ్చు. ప్రజాస్వామ్యానికి ఎన్నికల ప్రక్రియ పునాది. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా కీలకం. ఓటర్ల జాబితా ప్రక్షాళన 'సర్'పై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, పారదర్శకంగా ప్రక్రియ సాగితేనే ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. అనర్హులను తొలగించి అసలైన అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తే దేశంలో వివాదాస్పదం అవుతున్న 'సర్' నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. కాబట్టి 'సర్' ప్రక్రియ రాజకీయ వివక్ష లేకుండా నిజాయితీగా, పారదర్శకంగా జరిగితేనే ఎన్నికల సంఘం చెబుతున్న "ప్యూరిఫికేషన్"పై ప్రజల్లో "క్లారిఫికేషన్" వస్తుంది. 'సర్' అందరికీ సమ్మతం కావాలి. లేదంటే తెలంగాణలో కూడా 'సర్' మరో రాజకీయ తుపానుగా మారే అవకాశాన్ని కొట్టిపారేయలేం.

# ఐఎన్‌టీయూసీ నాయకుడు గూడూరు రవీందర్ కుటుంబానికి సీఐ విశ్వేశ్వర్ పరామర్శ

## కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన గీసుగొండ సీఐ.. రవీందర్ సేవలను స్మరించిన ప్రముఖులు

**గీసుగొండ, మే 28 అక్షర సవాల్:** వరంగల్ మధ్య పూటకు చెందిన గూడూరు రవీందర్ ఇటీవల ఆకస్మిక మరణం చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వరంగల్ విజయ డైరీలో ఉద్యోగిగా పనిచేస్తూనే ఐఎన్‌టీయూసీ నాయకుడిగా ఎదిగిన రవీందర్ తన నాయకత్వ లక్షణాలు, కార్మికుల పట్ల అంకితభావంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్నారు. ఈ క్రమంలో గీసుగొండ పోలీస్ స్టేషన్ సీఐ విశ్వేశ్వర్ రవీందర్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి ధైర్యం చెబుతూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రవీందర్ సేవలను స్మరించుకున్న సీఐ విశ్వేశ్వర్, కార్మికుల హక్కుల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో మంచి మనసున్న వ్యక్తిగా రవీందర్ అందరి మన్ననలు పొందారని అన్నారు. రవీందర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, మిత్రులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# తృణమూల్ ఇక చరిత్రేనా...

**కోల్ కత్తా, మే 28:** పశ్చిమ బెంగాల్‌ను 15 ఏళ్లు ఏకచత్రాధిపత్యంగా పాలించారు మమతా బెనర్జీ. అక్కడి కమ్యూనిస్టు పాలకుల రికార్డును చెరిపేయాలని ప్రయత్నించారు. కానీ అమె అనుసరించిన విధానాలు, భారత వ్యతిరేక ధోరణి, వసలవాదుల అనుకూల వైఖరి, ఇటీవల జరిగిన ఎన్నికల్లో మమతతోపాటు, తృణమూల్ కాంగ్రెస్‌ను బెంగాలీలు చిత్తుగా ఓడించారు. అధికారం కోల్పోవడంతో పార్టీలో ఇప్పుడు లుకలుకలు మొదలయ్యాయి. అధినేత్రి అదేశాలను కూడా గెలిచిన ఎమ్మెల్యేలు లెక్క చేయడం లేదు. దీంతో మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఎన్నికలు ముగిసిన వెంటనే పార్టీలో ఉత్పన్నమైన అసంతృప్తి, నాయకుల వలసలు, సంస్థాగత బలహీనతలు మమతా ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారాయి. ఇటీవలి ఎన్నికల తర్వాత టీఎంసీ ఆహ్వానించిన ధర్నా కార్యక్రమం పార్టీ బలహీనతను బహిర్గతం చేసింది. మొత్తం ఎమ్మెల్యేలలో కేవలం 40 శాతం మంది మాత్రమే పాల్గొనడం ద్వారా పార్టీలోని వ్యతిరేకత స్పష్టమైంది. తర్వాతి ఎమ్మెల్యేల సమావేశాల్లో హాజరు ఇంకా తగ్గి, 25వ తేదీ నాటికి 40 మందికిపైగా గైర్హాజరు అయ్యారు. హాజరైన ఎమ్మెల్యేలు పార్టీ నిర్వహణను తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా అభిషేక్ బెనర్జీ నాయకత్వ సామర్థ్యంపై ప్రశ్నలు లేవనెత్తారు. ఫాల్టా




నియోజకవర్గం (అభిషేక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని) అభ్యర్థి జహంగీర్ ఖాన్ విషయంలో తీసుకున్న నిర్ణయం కూడా తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఇది పార్టీలో కుటుంబ ప్రాధాన్యతలపై ఉన్న వ్యతిరేకతను ప్రతిబింబిస్తుంది. పార్టీ సంక్షోభం అసెంబ్లీ స్థాయిలో మాత్రమే కాకుండా స్థానిక సంస్థల వరకు వ్యాపించింది. ఎన్నికలు ముగిసిన వెంటనే ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీని వీడగా, మున్సిపల్ కౌన్సిలర్లు కూడా బయటకు వస్తున్నారు. ఈ వలసలు టీఎంసీ గ్రాస్‌రూట్ స్థాయి బలాన్ని బలహీనపరుస్తున్నాయి. ఆసక్తికరంగా, బీజేపీ ఈ రకమైన టీఎంసీ నాయకులను చేర్చుకోవడానికి ఇష్టపడడం లేదని సంకేతాలు వస్తున్నాయి. దీని వల్ల బయటకు వచ్చిన నాయకులు రాజకీయంగా ఒంటరిగా మారేప్రమాదం ఉంది. టీఎంసీ ప్రధాన కార్యాలయం అద్దె భవనంలో ఉండటం, యజమాని ఖాళీ చేయమని నోటీసు ఇవ్వడం పార్టీ స్థితిని సంకేతిస్తోంది. సమావేశాలు నిర్వహించడానికి కూడా తగిన మౌలిక సదుపాయాలు లేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడే మరో కీలక పరిణామం: భారాసాత్ ఎంపీ భారాసాత్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం. ఇలాంటి రాజీనామాలు పార్టీలోని ఉన్నత స్థాయి అసంతృప్తిని తెలియజేస్తాయి. మమత ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో నిస్సహాయతకు గురవుతున్నారని అంచనా వేస్తున్నారు. బెంగాల్‌లో కమ్యూనిస్టు శక్తులు ఇప్పటికీ కొంత పట్టు కలిగి ఉన్నాయి. అయితే రాబోయే ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయో చెప్పడం కష్టం. టీఎంసీలోని ప్రస్తుత సంక్షోభం కొనసాగితే, మమతా నాయకత్వం ఐదేళ్లు కూడా మనుగడ సాగించడం కష్టమే అనిపిస్తోంది. మమతా బెనర్జీ రాజకీయ ప్రయాణం ఎప్పుడూ సవాళ్లతో నిండి ఉంది. కానీ ఈసారి సవాళ్లు పార్టీ లోపలి నుంచి వస్తున్నాయి. అంతర్గత ఐక్యతను పునరుద్ధరించకపోతే, దశాబ్దాల పాలన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ వేగంగా క్షీణించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# వినూత్న నిర్ణయాలతో విజయ్...

**చెన్నై, మే 28:** విజయ్ సినిమాలు విడుదలయితే తమిళనాడులో సరికొత్త రికార్డులు నమోదవుతాయి. బాక్స్ ఆఫీస్ వద్ద సరికొత్త వసూళ్లు సాధ్యమవుతాయి. కానీ, రీల్ లైఫ్ నుంచి రియల్ లైఫ్ కి వచ్చిన తర్వాత.. ముఖ్యమంత్రిగా మారిపోయిన తర్వాత విజయ్ తన స్టైల్ పూర్తిగా చేంజ్ చేసుకున్నారు. మేకోవర్ నుంచి మొదలు పెడితే పాలిటిక్స్ వరకు అన్నిట్లో గేమ్ చేంజింగ్ పర్సన్ అయిపోయారు. తమిళనాడులో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు విజయ్ ని మరో స్థాయికి తీసుకెళ్తున్నాయి. విజయ్ ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాలు సంచలనంగా మారాయి. ముఖ్యంగా కోయంబత్తూరు బాలిక ఘటనలో విజయ్ స్పందించిన తీరు యావత్ దేశాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. క్షణాల్లో విజయ్ తీసుకున్న నిర్ణయం బాలిక కుటుంబానికి న్యాయం చేసింది. అంతేకాదు ఈ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు జైలు పాలయ్యేలా చేసింది.. ఇలా చెప్పుకుంటూ పోతే విజయ్ చేస్తున్న పరిపాలన.. తీసుకుంటున్న నిర్ణయాలు అచ్చం సినిమాల మాదిరిగానే ఉన్నాయి. తాజాగా విజయ్ తన రాష్ట్ర రైతులకు శుభవార్త చెప్పారు.. వారందరి సంక్షేమమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. రైతులకు సంబంధించిన 50 వేల వరకు రుణాలను పూర్తిగా మాఫీ చేస్తున్నట్టు విజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. సాకార బ్యాంకులో గత ఏడాది మే 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు రుణాలు తీసుకున్న వారందరికీ ఇది వర్తిస్తుందని విజయ్ స్పష్టం చేశారు. ఇంతటితోనే విజయ్ ఆగిపోలేదు. లక్ష రూపాయలు, అంతకు పైన రుణాలను ఐదు విభాగాలుగా విభజించి.. 20000, 15000, 10000, 5000 చొప్పున రుణాలను మాఫీ చేస్తున్నట్టు విజయ్ ప్రకటించారు. తద్వారా రైతుల మీద ఉన్న రుణ భారాన్ని తగ్గిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. తమిళనాడు రైతులకు విజయ్ తీసుకున్న నిర్ణయం ఎంతగానో ఉపయోగకరంగా ఉండనుంది. అంతేకాదు వారికి వ్యవసాయంలో మెరుగైన ఉత్పత్తి సాధించడానికి.. దోహదం చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల డిఎంకె అధినేత స్టాలిన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయ్ ఎన్నికల ముందు హామీ



ఇచ్చినట్టుగా.. నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అయితే వీటిపై విజయ్ ఇంతవరకు స్పందించలేదు. కేవలం తన చేతల ద్వారా మాత్రమే స్టాలిన్ వ్యాఖ్యలకు సమాధానం చెబుతున్నారు. అన్నట్టుగానే ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నారు. తద్వారా తాను మాటల ముఖ్యమంత్రిని కాదని.. చేతల ముఖ్యమంత్రినని నిరూపించుకుంటున్నారు విజయ్.

# కర్ణాటకలో రెండో కృష్ణుడు...

**బెంగళూరు, మే 28:** అధికారంలోకి రాకముందు కుర్చీల కోసం కొట్లాట.. అధికారం వచ్చిన తర్వాత పదవుల కోసం కొట్లాట.. కాంగ్రెస్ పార్టీలో రాజకీయాల గురించి ఢిల్లీకి సర్కిల్స్ ప్రాంతంలో బాగా పేరుపొందిన సామెత ఇది. ఈ సామెత సంవత్సరాల కాలం నాటిదైనప్పటికీ.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉందంటే కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. దేశమంతా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో మాత్రం అనుకూలమైన వాతావరణం కొనసాగుతోంది. దక్షిణాది రాష్ట్రాలలో కేరళ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. తమిళనాడులో అధికార పార్టీలో భాగస్వామ్య పక్షంగా ఉంది. ఉన్న అధికారాన్ని సుస్థిరం చేసుకొని.. దేశవ్యాప్తంగా అధికారాన్ని దక్కించుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ చేయాల్సి ఉండగా.. దక్షిణాది రాష్ట్రాలలో అందుకు భిన్నంగా సాగుతోంది. ముఖ్యంగా పదవుల కోసం నాయకుల మధ్య జరుగుతున్న పోరాటాలు ప్రజల్లో చులకన భావాన్ని కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రధానమైన కన్నడ సీమలో ప్రస్తుతం సీఎం మారతారు అనే చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ధరామయ్య



రాజీనామా చేస్తారని వార్తలు వస్తున్నాయి.. కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఈనెల 30న ప్రమాణస్వీకారం చేస్తారని కూడా తెలుస్తోంది. ముఖ్యమంత్రి స్థానం కోసం శివకుమార్ మధ్య.. సిద్ధరామయ్య మధ్య పోటీ ఎప్పటినుంచో సాగుతూనే ఉంది. ఇద్దరు కూడా బలమైన నాయకులు కావడంతో ఎవరి మనసు నొప్పించకుండా ఉండేందుకు అధిష్టానం నాయకత్వ మార్పు ప్రక్రియను చేపడుతున్నట్లు తెలుస్తోంది.. గతంలో సీఎం స్థానం కోసం శివకుమార్ అనేక రకాలుగా ప్రయత్నాలు చేశారు. ఈ పంచాయతీ ఢిల్లీ దాకా కూడా వెళ్ళింది. అధిష్టానం మధ్యలో జోక్యం చేసుకోవడంతో శివకుమార్ కాస్త వెనక్కి తగ్గారు. అప్పట్లోనే అధిష్టానం శివకుమార్ కు కొంత వ్యవధి ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు ఆ వ్యవధి ముగిసిపోవడం శివకుమార్ అధిష్టానం ముందు ప్రస్తావించినట్టు తెలుస్తోంది. నీతో నాయకత్వ మార్పుకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. అధిష్టానం చెప్పినట్టు సిద్ధరామయ్య నడుచుకుంటారని కర్ణాటక మీడియాలో వార్తలు వస్తున్నాయి. గురువారం సిద్ధరామయ్య తన మంత్రివర్గంలో ఉన్న వ్యక్తులకు అల్పాహార విందు ఇస్తారని.. ఆ తర్వాత లోక్ భవన్ కు వెళ్లి గవర్నర్ కు రాజీనామా పత్రం సమర్పిస్తారని తెలుస్తోంది.. గురువారం ఉదయాన్నే ఢిల్లీ నుంచి సిద్ధరామయ్య ఇంటికి వస్తారని.. ఆ తర్వాత వారిద్దరూ మీడియాతో మాట్లాడే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేసులో ఉన్న వ్యక్తులలో డీకే శివకుమార్ తో పాటు పరమేశ్వర పేరు కూడా వినిపిస్తోంది. మరోవైపు తాను రాజీనామా చేసిన తర్వాత.. కర్ణాటక రాష్ట్రంలో బలంగా ఉన్న అహింద వర్గాలకే ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టాలని సిద్ధరామయ్య చెప్పినట్టు తెలుస్తుంది.

# గ్రామపంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు మొదటి తేదీనే వేతనాలు ఇచ్చేలా చేసిన సిపిఐకి-ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

**నల్లబెల్లి మే 28 అక్షర సవాల్ :**సీపీఐ పార్టీ గత రెండు నెలల నుండి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి ప్రతినెల వేతనాలు చెల్లించాలని, ఆదివారం సెలవు దినంగా ప్రకటించాలని, కార్మికులుగా గుర్తిస్తూ కార్మిక చట్టాలను వర్తింపజేయాలని గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని సంఘటితం చేసి ఉన్నత అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో, సిపిఐ పార్టీ విశేష కృషి చేసిందని, సిపిఐ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ కూనంనేని ని సాంబశివరావు, నెల్లికంటి సత్యం తో కూడిన బృందం రాష్ట్ర ముఖ్యమంత్రితో కార్మికుల సమస్యలపై చర్చించినందుకు స్పందించిన ముఖ్యమంత్రి ప్రతినెల మొదటి తేదీననే వేతనాలు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నందుకు సిపిఐ పార్టీకి మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి




రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఏఐటీయూసీ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సంఘం మండల కోశాధికారి మామిడిపల్లి రవి చెప్పారు. మండల కేంద్రమైన నల్లబెల్లిలో జరిగిన మల్టీపర్పస్ వర్కర్స్ మండల కమిటీ సమావేశంలో సిపిఐ మండల కోశాధికారి యం రవి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని అభినందిస్తున్నామన్నారు . ఇదివరకే పెండింగ్ లో ఉన్న వేతనాలన్నిటిని జూన్ మొదటి తారీకు వరకు క్లియరెన్స్ చేయాలని అన్నారు అంతే కాకుండా పారిశుద్ధ్య సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం కార్మికులుగా గుర్తిస్తూ కార్మిక చట్టాలను రక్షణలను వర్తింపచేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య ఎంపీడబ్ల్యు సంఘం గౌరవ అధ్యక్షులు జన్ను సుదర్శన్ మండల నాయకులు అంబి రాజు లోనె లింగయ్య కనకం రాజు గుండెబోయిన ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాయిని ని కలిసిన హనుమకొండ నూతన ఆర్డీవో వెంకటేష్

**హనుమకొండ, అక్షర సవాల్ :**వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ని హనుమకొండ నూతన ఆర్డీవో వెంకటేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో



జరిగిన ఈ సమావేశంలో ఇటీవల ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్, ఎమ్మెల్యే గారికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## పంతులుపల్లి పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా

# యువత, స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు

**నల్లబెల్లి మే 28 అక్షర సవాలు :**ప్రొ జయశంకర్ బడిబాట కార్యక్రమం 2026–27 అమలులో భాగంగా ఈరోజు నాగరాజుపల్లి గ్రామ పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో యువత మరియు స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. పాఠశాల హెడ్మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో నాగరాజుపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి ఎరుకల లలిత రఘు ప్రత్యేక అతిథిగా హాజరు కాగా, వార్డు సభ్యులు ఊటుకూరి కృష్ణ స్థానిక లెగసీ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ కు యువత సహకరించాలని, పేరెంట్స్ ప్రైవేటు మోజు విడనాడి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించేలా అవగాహన కల్పించాలని, ఒక్కొక్కరు కనీసం ఒక్కొక్క విద్యార్థిని తమ పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా స్థానిక సర్పంచ్ ఎరుకల లలిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు ఉచిత అల్పాహారం, 14రకాల వస్తువులతో కిట్ కూడా ఇవ్వనున్నట్లు పేర్కొంటూ, గ్రామంలోని బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో లెగసీ యువజన సంఘం సభ్యులు ఊటుకూరి విష్ణువర్ధన్, పెండ్లి విష్ణువర్ధన్, ఇంతల




పవన్, అభిషేక్ మరియు విష్ణువికాస్ పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

## సీతక్క ప్రెస్‌మీట్ బహిష్కరించిన ఏటూరునాగారం జర్నలిస్టులు

**ములుగు/ఏటూరునాగారం, మే 28, అక్షర సవాల్:**వార్తలు రాసిన జర్నలిస్టుల ఇళ్లను ముట్టడిస్తాం, వారిపై దాడులు చేస్తామని కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఏటూరునాగారం జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నేడు జరగనున్న మంత్రి సీతక్క ప్రెస్‌మీట్‌ను ఏటూరునాగారం జర్నలిస్టులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి



రోడ్డుపై నిరసన కార్యక్రమం చేపట్టి, జర్నలిస్టుల స్వేచ్ఛను హరించే విధంగా బెదిరింపులు చేయడం తగదని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛకు గౌరవం ఇవ్వాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# ఆదివాసీల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఈసాల నరసయ్య సేవలు...

## దశదినకర్మలో నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ

**మంగపేట, మే 28 అక్షర సవాల్:** ములుగు జిల్లా మంగపేట మండలం నర్సాయిగూడెం గ్రామానికి చెందిన గ్రామ పెద్ద ఈసాల నరసయ్య దశదినకర్మ కార్యక్రమం గురువారం ఆదివాసి ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ మాట్లాడుతూ, ఈసాల నరసయ్య ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ నేటి తరానికి అందించిన గొప్ప వ్యక్తిగా నిలిచారని పేర్కొన్నారు. గ్రామ పెద్దగా వ్యవహరిస్తూ గ్రామంలోని ప్రతి కార్యక్రమాన్ని సమన్వయం చేసి, ప్రజల్లో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించడంలో



ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చినా శాంతియుతంగా పరిష్కరించే నాయకత్వ లక్షణాలు ఆయన సొంతమని కొనియాడారు. ఆదివాసి సంప్రదాయాలను పాటిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఈసాల నరసయ్య సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు మడే పూర్ణిమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మడి రామయ్య, ఈసాల చిన్న నరసయ్య, జువ్వాజి ముసలయ్యతో పాటు పెద్ద ఎత్తున ఆదివాసి మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వడదెబ్బకు ఐదు రోజుల్లో దంపతుల మృతి

**లష్కర్ సింగారం, మే 28 అక్షర సవాల్:** 53వ డివిజన్ లష్కర్ సింగారంలో వడదెబ్బ కారణంగా ఐదు రోజుల వ్యవధిలో భార్యాభర్తలు మృతిచెందారు. రేణిగుంట్ల రాజేందర్ 24-05-2026న వడదెబ్బతో మరణించగా, నేడు మధ్యాహ్నం ఆయన భార్య రేణిగుంట్ల సమత కూడా వడదెబ్బతో కన్నుమూశారు. పెయింటింగ్



పని చేసి కుటుంబాన్ని పోషించే రాజేందర్ మృతితో తల్లి సారమ్మ, కుమార్తె హాసిని ఒంటరయ్యారు. స్థానికులు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. సంప్రదించండి: ౦91 9618155368

## కళ్యాణ లక్ష్మి పథకం

# ఆడబిడ్డల పెళ్లిళ్లకు వరం





**మంగపేట, మే 28, అక్షర సవాల్:**కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు వరాలు అంటూ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంగపేట మండలంలో గురువారం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల చెక్కులను మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు మండల తహసిల్దార్ తోట రవీందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లిలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా రూ.1లక్షా 116 లు ఆ కుటుంబానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులు అందుకున్న కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచంద్ర వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రేగ కళ్యాణి స్థానిక తాసిల్దార్ తోట రవీందర్ రెవిన్యూ శాఖ సిబ్బంది మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కొనాయమాకులలో

# బక్రీద్ వేడుకలు....

## ఈద్గాలో ప్రత్యేక నమాజ్‌లు.. పరస్పరం ఈద్ ముబారక్ చెప్పుకున్న ముస్లిం సోదరులు

**గీసుకొండ, మే 28 అక్షర సవాల్:** గీసుకొండ మండల పరిధిలోని కొనాయమాకుల గ్రామంలో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఈద్గా వద్ద పెద్ద సంఖ్యలో ముస్లింలు ఒకచోటికి చేరుకుని ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగానికి, సేవాభావానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని గ్రామంలో సోదరభావం, సామరస్య వాతావరణంలో జరుపుకోవడం ఆనందంగా ఉందని ముస్లిం పెద్దలు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో గ్రామ ముస్లిం కులపెద్దలు ఎండీ జహీర్, రహీమ్, అలీ, అక్బర్, మహబూబ్ అలీ, మైన్, రాజ్ మహమ్మద్, ముర్తుజా, రఫీ, అల్లావుద్దీన్, పాషా, అజార్‌లతో పాటు పెద్ద సంఖ్యలో ముస్లిం



సోదరులు, యువకులు పాల్గొన్నారు.

# డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన మానవ హక్కుల సంఘం నేతలు - పలు సమస్యలపై వినతి

**హైదరాబాద్,మే 28 అక్షర సవాల్:** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా నూతన బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్‌ని అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షులు,ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుర్తి విజయ్ కుమార్,మహిళా జిల్లా అధ్యక్షురాలు గడ్డం సుభద్రలు కలిసి డీజీపీకి పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు,అత్యాచారాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా మైనర్ బాలికలపై జరిగే లైంగిక నేరాలపై పాక్సో చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి నేరస్తులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ పలు




సమస్యలను వినతి పత్రం ద్వారా డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వినతిపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్ సంబంధిత సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# పారదర్శకంగా పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

## బదిలీలపై వచ్చిన ఆరోపణలు వాస్తవ విరుద్ధం : సంఘాల ప్రతినిధులు

**గీసుగొండ, మే 28 అక్షర సవాల్:** వరంగల్ జిల్లాలో బుధవారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సాధారణ బదిలీల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్వహించబడిందని పంచాయతీ కార్యదర్శుల సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.38కు అనుగుణంగానే బదిలీల ప్రక్రియను పూర్తి చేసినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొన్ని పత్రికల్లో ప్రచురితమైన బదిలీల గందరగోళంపై వచ్చిన వార్తలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని సంఘ నేతలు ఖండించారు. జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో ఎలాంటి పక్షపాతం లేకుండా, నిష్పక్షపాతంగా కౌన్సిలింగ్ నిర్వహించారని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను సానుభూతితో పరిశీలించి, బదిలీల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈఓ, డీపీఓలకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం డెప్యుటేషన్‌పై కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శులకు కూడా న్యాయం చేయాలనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం సానుకూల నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. వారి కోసం శుక్రవారం ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి, వారు కోరుకున్న స్థానాలను కేటాయించేలా చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎజిల్లాలోని పంచాయతీ కార్యదర్శులందరికీ సమాన న్యాయం జరిగేలా అధికారులు తీసుకుంటున్న చర్యలకు తమ సంఘాలు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాయని, భవిష్యత్తులోనూ ఇదే పారదర్శకత కొనసాగించాలని కోరారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో పంచాయతీ కార్యదర్శుల సంఘాల ప్రతినిధులు జి. యాకుబ్ నాయక్, డి. కృష్ణరాజు, డి. సదానందం, బి. మధు, పోలు రాజేంద్ర ప్రసాద్, ఆర్. శంకర్ రావు, శ్రీధర్, పృథ్వి ఉన్నారు.

# మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులు

**ధర్మసాగర్,అక్షర సవాల్ :**ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన చెట్ల మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు మానవత్వంతో అండగా నిలిచారు. 1997-98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి విద్యార్థులు మహేష్ కుటుంబ పరిస్థితి తెలుసుకుని గురువారం వారిని పరామర్శించారు. మహేష్ భార్య, తల్లిదండ్రులు, తమ్ముడికి రూ.45 వేల ఆర్థిక సహాయం



అందజేశారు. కష్టకాలంలో ఆ కుటుంబం ఒంటరిగా లేదని, అన్ని విధాలా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా స్నేహితులు మహేష్‌తో గడిపిన పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. జీవితంలో నిజమైన స్నేహం విలువ ఇలాంటి సందర్భాల్లోనే తెలుస్తుందని అన్నారు. చిన్ననాటి మిత్రులు చూపిన మానవత్వాన్ని స్థానికులు అభినందించారు.

## కరీంనగర్ నగరంలో బాల్య వివాహాల చట్టాలపై అవగాహన



**కరీంనగర్:**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ శివాజీనగర్ అంగన్వాడీ కేంద్రం, అంబేద్కర్ భవన్ హాల్ లో 27వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో –బాల్య వివాహ రహిత తెలంగాణ మహిళా థీమ్ తో కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల కలిగే ఆడపిల్లలకు కలిగే నష్టల గురుంచి తెలియజేసారు. ఇప్పుడు ఉన్న యువత సినిమాలు లో చూపించినదే ప్రేమ అనుకుని తల్లిదండ్రులను ఎదురించడం. ప్రేమ వివాహానికి ఒప్పుకోక పోతే లేచి పోయి పెళ్లి చేసుకొని ఎందరో అమ్మాయిలు వాళ్ళ జీవితాలను నాశనం చేసుకున్నారాని అన్నారు. యువత ఒక మంచి లక్ష్యాన్ని ఏర్పాచుకొని వాటి సాధన కై కృషి చేయాలి అని అన్నారు. సీడీపీవో సబిత మాట్లాడుతూ 1098 టోల్ ఫ్రీ నెంబర్ గురుంచి చెప్పారు. బాల్య వివాహల కంప్లైంట్స్ 1098 కి కాల్ చేసి నేరుగా చెప్పా వచ్చు అన్నారు.మహిళలు తమ ఆరోగ్య పట్ల శ్రద్ధ చూపాలి మహిళలు ఆరోగ్యాంగా ఉంటే నే కుటుంబం ఆరోగ్యాంగా ఉంటుంది అని తద్వారా ఆరోగ్య సమాజం నిర్మించ బడుతుందని అన్నారు.ౄఎజ లాలో మహిళలు హెల్త్ పరీక్షలు చట?యువకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో 27డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ కుమార్ , ఐఎెం ఒబజూవతీజఅంశీతీ ం రేణుక . వార్డ్ ఆఫీసర్ ష్ట్రఅతీబఝశ్రీ , జూ సునీత , అంగన్వాడీ టీచర్స్ ౯ూ, మహిళలు పెద్ద సంఖ్య లో హాజరు అయినారు

## కాంగ్రెస్ పార్టీపై బీసీ నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ ఫైర్



**హైదరాబాద్:**కర్ణాటక సీఎం సిద్ధి రామయ్యను సీఎం పీఠం నుండి తొలగిస్తూ కాంగ్రెస్ బీసీలకు ద్రోహం చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కర్ణాటక సీఎం సిద్ధి రామయ్యను తొలగించడం అన్యాయం . బీసీలు పాలకులుగా ఉండటం కాంగ్రెస్ కు ఇష్టం లేదు. రాహుల్ గాంధీ మాటలకు, ఆచరణకు ఎక్కడ పొంతన లేదని అన్నారు.రాహుల్ గాంధీ నోట పేరుకే కులగణన, ఎవరి వాటా వారి కే అన్నమాట అన్నది నీటి మూట లాంటిది. దేశంలోని 29 రాష్ట్రాల్లో కాంగ్రెస్ సీఎంలు నాలుగు రాష్ట్రాలు మాత్రమే. అందులో సిద్ధిరామయ్య తప్ప మూడు రాష్ట్రాల సీఎంలు అగ్రవర్ణాలే . నేడు కర్ణాటక సీఎం సిద్దరామయ్యను తొలగించడంతో ఇక నాలుగు రాష్ట్రాలు అగ్రకుల సీఎంలే . తెలంగాణ, కేరళ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇక కర్ణాటక రాష్ట్రం కూడా కాంగ్రెస్ అగ్రకులలాకే సీఎం పీఠశీ కట్టబెడుతుంది. బిసి గొర్రె కాపరుల కుటుంబం నుండి వచ్చిన సిద్ధరామయ్యను తొలగించి బడా వ్యాపార వేత్త, అగ్రకులానికి చెందిన డీకే శివకుమార్ నియమించి కాంగ్రెస్ పార్టీ దేశంలో సామాజిక న్యాయాన్ని బొంద పెట్టింది . నాటి నెహ్రూ కాంగ్రెస్ నుండి నేటి రాహుల్ కాంగ్రెస్ వరకు బీసీలకు అన్యాయమే జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ పుట్టుక నుండి నేటి వరకు పార్టీ జాతీయ అధ్యక్షుడుగాని, ప్రధానమంత్రిగా గాని, బీసీలకు అవకాశం కల్పించలే. కర్ణాటక సిద్ధిరామయ్య తొలగించడంతోనే దేశంలో కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమవుతుందని అన్నారు.

## జూన్ 6 వరకు ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతాయి: మంత్రి వివేక



**మంచిర్యాల, మే 28 :** తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) చెన్నూరు మండలం బావురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.

**హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో ఆలస్యం..**

పెద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40 లారీలను కేటాయించామని అన్నారు. మొత్తం 80 లారీలతో త్వరలోనే రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొని మిల్లులకు తరలిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

**ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర: మంత్రి అడ్లూరి**

ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈరోజు (గురువారం) జగిత్యాల జిల్లాలో మంత్రి అడ్లూరి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాలు పేరుతో దోచుకుంటున్నామని బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భద్రాద్రి రాముడి ఆలయం ముందు మాట్లాడాలని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేద్దామని అన్నారని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురావడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి బీజేపీ ఎంపీలు నిధులను తీసుకురావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ చేశారు.


## తెలంగాణలో ఆంధ్రా ఆటలు సాగావు

**హైదరాబాద్:**పవన్ కళ్యాణ్, చంద్రబాబులకు సిగ్గు శరం ఉంటే హైదరాబాద్ వదిలి అమరావతికి వెళ్లిపోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామ్యేల్ అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ ను అరెస్ట్ చేసేందుకు ఆంధ్రా పోలీసులు వస్తారా? ఇంకెక్కడి ఆంధ్రా.. గల్లా పట్టి నూకితే ఎప్పుడో పారిపోయారనిఅ న్నారు. మీ అయ్య జాగీరు ఉందా హైదరాబాద్లో? ఇక్కడ ఎందుకు ఉంటున్నారు? బతకమని వదిలేస్తే తెలంగాణను ఆగం చేద్దాం అని చూస్తావా చంద్రబాబు? నీ ఏడుపు ఏదో అమరావతిలో ఏడువు, లేకపోతే కుప్పంలో ఏడువు..అంతేకాని మా దగ్గర నీ ఆటలు సాగవని అన్నారు.

# ఓఆర్‌ఆర్ చుట్టూ మెట్రో కారిడార్..

**391 కిలోమీటర్ల నెట్‌వర్క్**


**హైదరాబాద్, మే 28:**హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రజా రవాణాను మెరుగుపరచడానికి, కాలుష్యాన్ని నివారించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మెట్రో రైలు వ్యవస్థను రికార్డు స్థాయిలో విస్తరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 122.6 కిలోమీటర్ల మేర రెండో దశ మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల అంచనాలతో కేంద్రానికి డీపీఆర్ సమర్పించింది. మూడో దశలో 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ మెట్రో కారిడార్‌తో పాటు, శంషాబాద్ నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను నిర్మించనున్నారు. దీనివల్ల హైదరాబాద్‌లో మొత్తం మెట్రో నెట్‌వర్క్ 391 కిలోమీటర్లకు చేరనుంది.హైదరాబాద్ మహానగర కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రజా రవాణా వ్యవస్థను సమూలంగా మార్చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త మెగా మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. నగరంలో నానాటికీ పెరిగిపోతున్న కాలుష్య నివారణే ధ్యేయంగా పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, మెట్రో నెట్‌వర్క్‌ను ఊహించని రీతిలో విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రతిరోజూ దాదాపు 40 లక్షల మంది ప్రయాణికులు మెట్రో ద్వారా ప్రయాణిస్తున్న తరహాలోనే.. హైదరాబాద్ క్యూర్ పరిధిలోని అన్ని వైపులా అద్భుతమైన మెట్రో కనెక్టివిటీని ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు ఉన్నతాధికారులు ఉమ్మడిగా కసరత్తు చేస్తూ చారిత్రాత్మక ప్రతిపాదనలను రూపొందించారు.ఇందులో భాగంగా..




హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించింది. మొత్తం 122.6 కిలోమీటర్ల మేర సాగే ఈ రెండో దశ విస్తరణను రూ.38,595 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిధుల భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్ పద్ధతిలో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నారు. రెండో దశలో ప్రధానంగా నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు, రాయదుర్గం నుంచి కోకాపేట నియోపొలిస్ వరకు 11.6 కి.మీ., ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ., మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కి.మీ., ఎల్‌బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కి.మీ., జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ., జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ. మెట్రో లైన్లను విస్తరించనున్నారు.మరోవైపు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిష్టాత్మక 'భారత్ ఫ్యూచర్ సిటీ' వరకు 39.6 కిలోమీటర్ల మేర సాగే సరికొత్త మార్గాన్ని రూ.7,168 కోట్ల అంచనా వ్యయంతో రెండో దశ కింద ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే.. ఈ మార్గాన్ని మూడో ప్రాజెక్టుగా పరిగణించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కేంద్రం నుంచి రెండో దశకు ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభించడంతో పాటు, మూడో దశ ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి స్థాయి డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులు నిశ్చయించారు. ఈ మూడో దశలోనే అత్యంత కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టును కూడా చేర్చారు.ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు మొత్తం 158 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రెండో దశలో ప్రతిపాదించిన మెట్రో లైన్లు అన్నీ కూడా దాదాపుగా ఓఆర్‌ఆర్ సరిహద్దులకు సమీపంలోనే ముగుస్తాయి. ఢిల్లీ మెట్రో లూప్ తరహాలో ఈ ప్రాంతాలన్నింటినీ అనుసంధానిస్తూ ఓఆర్‌ఆర్ చుట్టూ 160 కిలోమీటర్ల మేర ప్రత్యేక మెట్రో కారిడార్‌ను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం, పటాన్‌చెరు, చౌటుప్పల్, మేడ్చల్, శామీర్‌పేట్, శంషాబాద్, తుక్కుగూడ, ఘట్‌కేసర్ వంటి శివారు ప్రాంతాల నుండి ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ప్రతిరోజూ లక్షలాది మంది నగరంలోకి వస్తున్నారు. దీనివల్ల పగటిపూట విపరీతంగా వాహనాల రద్దీ పెరిగి తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రయాణ సమయం వృధా అవ్వడంతో పాటు ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారంగా మెట్రో కనెక్టివిటీ ఒక్కటే మార్గమని ప్రభుత్వం భావిస్తోంది. అన్ని కారిడార్లు కలిపి హైదరాబాద్ మహానగరంలో మొత్తం 391 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్ విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# పొలాల్లో శాటిలైట్ నిఘా..

**నిజామాబాద్, మే 28:**తెలంగాణలో పెరుగుతున్న పంట వ్యర్థాల దహనం ఘటనలు, ప్రాణ నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. కూలీల కొరత, పశువుల సంఖ్య తగ్గడం వల్ల రైతులు వ్యర్థాలను తగులబెడుతుండటంతో భూపాలపల్లి, నిర్మల్, హనుమకొండ జిల్లాల్లో నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో శాటిలైట్ నిఘా ద్వారా పంట వ్యర్థాలు తగులబెట్టేవారిని గుర్తించి ఎన్జీటీ నిబంధనల ప్రకారం రూ.2500 నుంచి రూ.15 వేల వరకు జరిమానాలతో పాటు, ఎయిర్ యాక్ట్ కింద మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఇంతకాలం ఉత్తర భారతదేశానిని, ముఖ్యంగా పంజాబ్ రాష్ట్రానికి పరిమితమనుకున్న పంట వ్యర్థాల దహనం ముప్పు ఇప్పుడు తెలంగాణను కూడా చుట్టుముడుతోంది. వరి, మక్కజొన్న సాగు తర్వాత మిగిలిపోయే వ్యర్థాలకు రైతులు నిప్పు పెడుతుండటం రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే కొత్త పర్యావరణ, ప్రాణ నష్టాల సవాలుగా మారుతోంది. ఇటీవలి కాలంలో పలు జిల్లాల్లో పంట వ్యర్థాలను తగులబెడుతూ పలువురు రైతులు ప్రాణాలు కోల్పోవడం, వందల క్వింటాళ్ల పంట నష్టం వాటిల్లడం పట్ల తెలంగాణ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్య తీవ్రరూపం దాల్చకముందే అడ్డుకట్ట వేసేందుకు సర్కార్ నడుం బిగించింది.గత కొద్ది నెలలుగా రాష్ట్రంలో ఈ తరహా ఘటనలు గణనీయంగా పెరిగాయి. సాధారణంగా పంజాబ్ వంటి రాష్ట్రాల్లో తదుపరి పంటకు సమయం తక్కువగా ఉండటం వల్ల రైతులు వ్యర్థాలను తగులబెడతారు. అయితే తెలంగాణలో పరిస్థితి వేరు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీల కొరత తీవ్రం కావడం, పశు



వుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడమే ఇందుకు ప్రధాన కారణాలని అధికారులు విశ్లేషిస్తున్నారు. గతంలో ఎండు గడ్డిని పశువుల మేతగా ఉపయోగించేవారు, కానీ ఇప్పుడు పశువులు లేకపోవడంతో పొలాలను త్వరగా శుభ్రం చేసుకునేందుకు రైతులు సులభమైన మార్గంగా భావించి నిప్పు పెడుతున్నారు. ఇప్పటికే ఖమ్మం, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ సమస్య తీవ్రమైంది. ఖమ్మం జిల్లా పాథర్లపాడులో ఇలా పెట్టిన మంటలు పక్క పొలాలకు వ్యాపించి వందల క్వింటాళ్ల దిగుబడి బూడిదైంది.పంట వ్యర్థాల దహనం కేవలం పర్యావరణానికే కాదు, రైతుల ప్రాణాలకూ ముప్పుగా మారింది. మే 24న భూపాలపల్లి జిల్లాలో చంద్రమౌళి అనే రైతు వ్యర్థాలను తగులబెడుతూ మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. ఆ ఘోరాన్ని కళ్లారా చూసిన ఆయన భార్య భాగ్యమ్మ గుండె ఆగి అక్కడికక్కడే మృతి చెందింది. మే 13న నిర్మల్ జిల్లాలో మంద గంగన్న అనే రైతు మక్కజొన్న వ్యర్థాలకు నిప్పు పెట్టగా.. ఆ మంటలు పక్కనే ఉన్న వరి పొలానికి వ్యాపించాయి. వాటిని ఆర్పే క్రమంలో ఆయన కాలిబూడిదయ్యాడు. మే 10న హనుమకొండ జిల్లాలో జి. జయపాల్ రెడ్డి అనే వృద్ధ రైతు వ్యర్థాలకు నిప్పు పెడుతూ ప్రమాదవశాత్తు జారిపడి మంటల్లో కాలి ప్రాణాలు కోల్పోయాడు.ఈ ఉదంతాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం రైతులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట వ్యర్థాల దహనాన్ని కేంద్ర ప్రభుత్వం, పర్యావరణ సంస్థలు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నాయని ఇది గాలి నాణ్యతతో పాటు భూసారాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఇకపై పొలాల్లో మంటలు పెట్టే రైతులను గుర్తించేందుకు శాటిలైట్ ఇమేజరీ ఉపయోగించబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.నిబంధనలు ఉల్లంఘిస్తే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలు, ఎయిర్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. అలాగే ఎన్జీటీ నిబంధనల ప్రకారం పర్యావరణ పరిహారం కింద జరిమానాలు విధిస్తారు. 2 ఎకరాల లోపు ఉన్న రైతులకు రూ2500, 2 నుంచి 5 ఎకరాల లోపు ఉన్నవారికి రూ5 వేలు, 5 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు ప్రతి ఘటనకు రూ15 వేల వరకు జరిమానా విధించనున్నారు. గ్రామాల్లో తక్షణమే అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

# తెలంగాణలో భారీగా తగ్గనున్న టెక్ట్స్ బుక్స్

**హైదరాబాద్, మే 28:**2026–27 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులకు భారీ ఊరటను ఇచ్చే వార్త వచ్చింది. విద్యార్థుల పుస్తకాల ధరలు భారీగా తగ్గడం విశేషం. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి పాఠ్య పుస్తకాల ధరలు తగ్గడంతో.. ఆర్థికంగా కాస్త రిలీఫ్ లభించింది. గరిష్ఠంగా 20 శాతం వరకు ధరలు తగ్గడంతో విద్యార్థులు ఆనందంగా ఫీల్ అవుతున్నారు. ఒకవైపు యుద్ధం కారణంగా అన్ని రకాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ.. పుస్తకాల ధరలు తగ్గడం గమనార్హం. అయితే ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం కొన్ని రోజుల క్రితం పుస్తకాల ప్రింటింగ్ కోసం.. టెండర్లను పిలిచింది. ఈ టెండర్లలో 3 ప్రింటింగ్ సంస్థలు గతం కంటే 20 శాతం తక్కువగా కోట్ చేయడంతో పుస్తకాల ధరలు దిగి వచ్చాయి.గతంలో ఒక్కో పేజీ ప్రింటింగ్ ధర 54 పైసలు ఉండగా.. అది ప్రస్తుతం 44.50 పైసలకు దిగి వచ్చింది. ఉదాహరణకు 1వ తరగతిలోని 3 పుస్తకాలు కలిపి గతేడాది రూ.247లు కాగా.. ఈసారి రూ.209కి తగ్గాయి. ఇఖ 10వ తరగతిలోని మొత్తం 8 పుస్తకాల ధర గత విద్యా సంవత్సరంలో రూ.1,078 ఉండగా ఈసారి రూ.900కి తగ్గింది. అంటే.. ఒక్క టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఈ ఏడాది రూ.178 ఆదా అయ్యాయి. జూన్ 5వ తేదీ నుంచి కొత్త పుస్తకాలు మార్కెట్లో అందుబాటులోకి రానున్నాయి.మరోవైపు.. పుస్తకాల ధరలు తగ్గినంత మాత్రాన.. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రింటింగ్‌లో, బైండింగ్‌లో ఎలాంటి రాజీ లేకుండా.. మెరుగైన క్వాలిటీతో లామినేటెడ్ పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ఇక.. వరుసగా 4వ ఏడాది కూడా పాఠ్యపుస్తకాల ధరలు తగ్గడంతో.. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పింది. 2023–24 అకడమిక్ ఇయర్‌లో 10వ తరగతి విద్యార్థుల పుస్తకాల కోసం రూ.1,482 ఖర్చు కాగా..



2025–26లో అది రూ.1,078కు దిగి వచ్చింది. తాజా తగ్గింపుతో ఈ ఏడాది టెన్త్ టెక్ట్స్ బుక్స్ సెట్ ధర రూ.900కు తగ్గింది.అదే విధంగా 9వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.927 నుంచి రూ.776కు (రూ.151) తగ్గింది. 8వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.825 నుంచి రూ.690కి (రూ.135) తగ్గాయి. ప్రైమరీ క్లాసులకు కూడా ఒక్కో సెట్‌పై రూ.35 నుంచి రూ.60 వరకు ధరలు తగ్గాయి. ఇక సబ్జెక్టుల వారీగా పుస్తకాల ధర తగ్గింపు చూస్తే.. టెన్త్ మ్యాథ్స్ టెక్ట్స్ బుక్ ధర గతంలో రూ.225 ఉండగా.. ఇప్పుడు రూ.187కు తగ్గింది. సోషల్ పుస్తకం రూ.192 నుంచి రూ.160కి తగ్గింది. 9వ తరగతి మ్యాథ్స్ బుక్ రూ.201 నుంచి రూ.167కు.. 8వ తరగతి మ్యాథ్స్ రూ.205 నుంచి రూ.171కి తగ్గిందిఅయితే గతం కంటే ఇప్పుడు.. ముడి సరుకుల ధరలు 20 శాతం పెరిగినప్పటికీ.. పబ్లిషర్లు మాత్రం గతేడాది కంటే తక్కువ ధరకే పుస్తకాలను ముద్రించేందుకు ముందుకు రావడం గమనార్హం. గతేడాది ఎల్1 గా నిలిచిన ఆర్క్‌బర్డ్ సంస్థ పేజీకి 54 పైసలు కోట్ చేయగా.. ఈ ఏడాది నవతెలంగాణ ప్రింటర్స్, డీకే పబ్లికేషన్స్, సూపర్ ప్రింటర్స్ సంస్థలు కేవలం 44.50 పైసలకే పుస్తకాలను ప్రింట్ చేస్తామని ప్రకటించి.. ఎల్–1గా నిలిచాయి.

## వానలు రాకముందే పూడికలు తీయండి

**మేడ్చల్:**సరూర్నగర్ చెరువు పూడికలు తీస్తామన్నారు. చెరువును సగం ఎండబెట్టారు. చెరువు ప్రక్షాళన చేస్తాము అని అన్నారు అధికారులు, ఎల్బీ కాంగ్రెస్ గొప్పలు చెప్పారు. కానీ ఏమీ చేయలేదని బీజేపీ నేతలు ఆరోపించారు, ఎండాకాలం ముగిసిపోయింది. వర్షాకాలం వచ్చేస్తోంది. ఇప్పటికీ డ్రైనేజీ నీళ్లు అలాగే ఉన్నాయి. పూడికలు కూడా పూర్తిగా తీయలేదు. రేపు భారీ వర్షాలు పడితే ఆ నీళ్లు ఎక్కడికి వెళ్తాయి..? మళ్లీ చెరువులోకే పంపిస్తారా అని ప్రశ్నించారు.పూడికలు తీశాం" అని కాగితాల మీద పనులు చూపించి బిల్లులు డ్రా చేసుకోవడానికే ఈ డ్రామాలు చేస్తున్నారు. ప్రజల డబ్బుతో చేసే పనులు. ప్రజల ప్రాణాలను కాపాడాలి గానీ, ఫైళ్లలో ఫోటోలు పెట్టి కమీషన్లు కొట్టడానికి కాదు. ఇప్పటికైనా అధికారులు, కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొనాలి.ప్రజాధనాన్ని వృథా చేస్తూ, ప్రజల భద్రతను గాలికొదిలేస్తే ఒక రోజు ప్రజలే నిలదీస్తారు. జీతాలు తీసుకుంటే బాధ్యత కూడా తీసుకోండి. తక్షణమే నాళాలు, కుంటలు, చెరువులలో ఉన్న పూడికలను పూర్తిగా తొలగించండి. లేకపోతే నిర్లక్ష్యంతో జరిగే ప్రతి నష్టం... ప్రతి ప్రాణ హానికి బాధ్యత మీదేనని అన్నారు.

## మహబూబ్‌నగర్‌లో దొంగల ఘాతుకం..

**ఏకంగా ఎస్బీఐ ఏటీఎం మిషన్‌నే ఎత్తుకెళ్లిన వైనం!**

మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తా సమీపంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఎస్బీఐ ఏటీఎం సెంటర్‌లోకి చొరబడి, ఏకంగా ఏటీఎం మిషన్‌నే ఒక వాహనంలో వేసుకుని గుట్టుచప్పుడు కాకుండా పారిపోయారు.పక్కా ప్లాన్‌తో వచ్చిన దుండగులు.. లోపలికి వెళ్లగానే పవర్ సప్లై కట్ చేసి, సీసీటీవీ కెమెరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆపై బోయపల్లి సమీపంలోని పొలాల్లోకి మిషన్‌ను తీసుకెళ్లి, గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి అందులోని నగదును ఊడ్చేశారు.ఖాళీ ఏటీఎం బాక్స్‌ను పొలాల్లోనే వదిలేసి పరారవ్వగా.. అసలు ఎంత మొత్తంలో నగదు చోరీకి గురైందనేది బ్యాంకు లావాదేవీలను పరిశీలించిన తర్వాతే చెప్తామని పోలీసులు వెల్లడించారు. క్లూస్ టీమ్‌తో దర్యాప్తు ముమ్మరం చేశారు

# రేవంత్ ప్రభుత్వ పాలసీలు తుగ్లక్ పాలసీలు...

**రేవంత్ 2034 వరకు నేనే సీఎం అంటున్నావు కదా.. నీకు దమ్ముంటే ఇప్పుడే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని సవాలు విసురుతున్న.**

**- దద్దమ్మ ప్రభుత్వం ఎన్నుకున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

**- వెంటనే ప్రతి గింజ కొనుగోలు చేయాలని హెచ్చరిస్తున్నాము:ఎంపి ఈటల రాజేందర్.**



**నిర్మల్:** రైతు గోస బీజేపీ భరోసా" కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ లో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బీజేఎల్పీ లీడర్ మహేష్ రెడ్డి ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు రైతులతో మాట్లాడారు. ఇరవై రోజుల నుండి పట్టించుకోలేదు. ఈరోజు హడావుడిగా తరలిస్తున్నారు. ఒక్క క్వింటాకు 80 రూపాయల నుండి 100 రూపాయలు మేమే ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది.. హమాలికి 50 రూపాయలు, లారీకి 30 రూపాయలు ఇస్తేనే సంచులు తీసుకుపోతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే మంత్రి మమ్ముల్ని పట్టించుకున్న పాపాన పోలేదు అని రైతులు బీజేపీ నేతలకు వివరించారు. బీజేపీ వారు డ్రామా చేస్తున్నారని మంత్రులు విమర్శిస్తున్నారు కదా అని రైతుల వద్ద ప్రస్తావించిన ఈటల రాజేందర్.. దానికి రైతులు స్పందిస్తూ.. సీఎం మంత్రులకు "ఫుట్ బాల్" ఆట మీద ఉన్న ఆసక్తి రైతుల మీద, ధాన్యం కొనుగోళ్ల మీద లేదని రైతులు అన్నారు. కేంద్రం డబ్బులు ఇస్తున్నా వీరు మాత్రం కొనుగోళ్లు చేయలేక పోతున్నారు. మేమందరం మార్పు కోసం ఓటు వేసి సీఎంను మంత్రులను చేస్తే వీరు మాత్రం మమ్ముల్ని పట్టించుకోవడంలేదని సత్యనారాయణ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పొక్కలు పడ్డ సంచులు ఇచ్చారు. పండిన ధాన్యం మొత్తం కొనడం లేదు. కొన్ని సెంటర్స్ లో అసలు కొనుగోళ్లకోసం ఏర్పాట్లు కూడా చేయలేదనీ బీజేపీ నేతల బృందంకు రైతులు తెలియజేసారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతన్న మీద పగబట్టి ఇంత మోసం చేస్తారని కలలో కూడా ఊహించలేదు. నాలుగు రోజుల నుంచి మేము తిరుగుతున్నాము ఎక్కడికి వెళ్లినా ఒకటే వేదన ఒకటే దుఃఖం ఇంత శిక్ష ఈ ప్రభుత్వం ఆ మీద ఎందుకు వేస్తుందని రైతులు ఏడుస్తున్నారు. - మీరు వస్తున్నారని తెలియగానే బస్తాలు వస్తున్నాయి లారీలు వస్తున్నాయి.. మీరు తిరుగుతుంటే మాకు మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. వరి ధాన్యం మక్కలు తెల్ల జొన్నలు గోదాములకు చేరుకునేంతవరకు మీ యాత్ర ఆపవద్దు అని కోరుతున్నారు. - కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత మూర్ఖంగా అనాలోచితంగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందని ఊహించలేదు. తెల్ల జొన్నలు ఎకరానికి 30 క్వింటాలు దిగుబడి వస్తే 10 క్వింటాలు మాత్రమే కొంటామని ప్రభుత్వం చెప్తుంది ఈ ప్రభుత్వానికి బుద్ధి జ్ఞానం ఉందా అని రైతులు అడుగుతున్నారని అన్నారు. అసలు వ్యవసాయ పట్ల వీరికి అవగాహన ఉందా అని ప్రశ్నిస్తున్నారు. - మొక్కజొన్నలు 40 క్వింటాళ్లు దిగుబడి వస్తుంటే ఇరవై ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే కొంటామని ప్రభుత్వం ప్రకటిస్తే మిగిలిన మక్కలు ఎక్కడ అమ్ముకోవాలి. సన్ ఫ్లవర్ 5 వేలకు కొనే దిక్కులేదు.. నూనె గింజలు పండించండి అనే ప్రకటించావు కదా ఎందుకు కొనడం లేదని ప్రశ్నిస్తున్నాను. - బిడ్డా ఇదేనా నీ రైతు భరోసా.. - ఇదేనా నీ రైతు పాలసీ. కౌలు రైతులకు మార్కెట్ లో ధాన్యం అమ్ముకోవడానికి వీలు లేదు. భూమి యజమాని వచ్చి థంబ్ పెట్టాలి అంటున్నారు. ముంబైలో, దుబాయిలో, హైదరాబాద్ లో ఉన్న రైతు ఎలా వస్తాడు అనే సోయి ఈ ప్రభుత్వానికి ఉందా అని నేను అడుగుతున్నా. - నీ పాలసీలు తుగ్లక్ పాలసీలుగా ఉన్నాయి. మెదడు లేని పాలసీలుగా ఉన్నాయి. ఇలాంటి పద్ధతులన్నీ పక్కనపెట్టి పండించిన ప్రతి గింజ కొంటానని ఇచ్చిన మాట ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను. 2034 వరకు ఉంటానని అనుకుంటున్నావా బాబు.. నీకు కాలం దగ్గర పడిందని అన్నారు. దమ్ముంటే ఇప్పుడే రాజీనామా చేయి ఎన్నికలకు రా నీ సంగతి ఏందో తెలుస్తుంది. - ఆ ప్రభుత్వాన్ని బొంద పెట్టడానికి తొమ్మిదిన్నర ఇల్లు పట్టింది కానీ నీ ప్రభుత్వాన్ని బొంద పెట్టడానికి మూడేళ్లలోనే తేలిందని రైతులు అంటున్నారు. - ఎంత పంట దిగుబడి వస్తుందని అంచనాలు లేవా ఆ మాత్రం బుద్ధి జ్ఞానం లేకుండా పనిచేస్తున్నారా. అంచనాలకు అనుగుణంగా బస్తాలు, హమాలీలు, లారీలు, గోదాములు ఎందుకు ఏర్పాటు చేసుకోలేకపోయారు. - మేము రైతులకు భరోసా కల్పించడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడానికి వస్తే రాజకీయాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు బిడ్డ రా ఇక్కడికి తెలుసుకుందాం - నీకు రైతుల దగ్గరికి వచ్చే ముఖం దమ్ము లేదు. - ప్రెస్ మీట్ లు మా మీద పెట్టడం కాదు బిడ్డ.. రైతుల దగ్గరికి వచ్చి మాట్లాడండి. రైతులను ఆదుకునే ప్రయత్నం చేయండి తప్ప ఎదురు దాడి మంచిది కాదు. - రైతులారా గమనించండి ఇలాంటి దద్దమ్మలను ఎన్నుకొని మనం బాధపడుతున్నాము. చివరి గింజ కొనే వరకు రైతులకు మేము అండగా ఉంటామని అన్నారు. ఈ యాత్రలో బీజేపీ శాసనసభ పక్ష నాయకులు మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, హరీష్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి.. ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య అంజిరెడ్డి, ఖజఅ రెడ్డి స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మికి స్మార్ట్ కార్డులు..

**జూన్ 2 నుంచి పంపిణీకి ఆర్టీసీ కసరత్తు**

**ఇక ఆధార్ కార్డు అవసరం ఉండదు**

**దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఈ నిర్ణయం**

**తొలుత ప్రయోగాత్మకంగా ప్రతీ జిల్లాలో ఒక మండలంలో జారీ**

**కార్డుల కోసం ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు**

**ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో కేంద్రాల సమాచారం**




హనుమకొండ: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడానికి, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ప్రభుత్వ ప్రత్యేకంగా మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల జారీ చేయనున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీలో విద్యార్థులకు రాయితీ, ఉద్యోగులకు, ఇతరులకు నెలవారీగా సీజన్ పాస్ అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో మహాలక్ష్ములకు స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. ప్రస్తుతం ఆధార్ కార్డు చూపించి మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక నుంచి ఆధార్ కార్డుకు బదులు స్మార్ట్ కార్డు చూపించాల్సి ఉంటుంది.

**జూన్ 2 నుంచి జారీ**

స్మార్ట్ కార్డులు వచ్చే నెల 2వ తేదీ నుంచి అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బడ్జెట్ సన్నాహక సమావేశం లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎం.డి.నాగిరెడ్డి ఈ విషయమై సమీక్షించారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి నిధుల కేటాయింపు ప్రతిపాదలను ఆర్థిక శాఖ మంత్రికి ఎం.డి. నాగిరెడ్డి వివరించడం తోపాటు స్మార్ట్ కార్డుల జారీకి సంబంధించిన వ్యయం గురించి వివరించారు. ఇందుకు ఆమోదం తెలుపడంతో తొలుత జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని, సాంకేతిక సమస్యలు పరిష్కరించుకొని జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై కసరత్తు జరుగుతోంది. స్మార్ట్ కార్డుకు సంబంధించిన విధివిధానాలు ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని అధికారులకు ఇంకా అందలేదు. త్వరలో సమాచారం అందే అవ కాశం ఉన్నట్టు చెబుతున్నారు.

**ఏటీఎం తరహాలో కార్డు**

ఏటీఎం తరహాలో చిప్‌తో కూడిన స్మార్ట్ కార్డు జారీ చేస్తారు. ముందుగా ఆధార్ కార్డు, ఒక ఫొటో సేకరించి మహాలక్ష్ముల ప్రాథమిక సమాచారం చిప్‌తో అనుసంధానిస్తారు. ఈ స్మార్ట్ కార్డులో లబ్ధిదారుడి పూర్తి వివరాలు, ఫొటో, క్యూఆర్ కోడ్ ఉంటాయి. తర్వాత వారి పేర్లతో కార్డు జారీ చేస్తారు. అమల్లోకి వచ్చాక స్మార్ట్‌కార్డు చూపకుంటే ఉచిత ప్రయాణానికి అనుమతివ్వరు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల పరిధిలో నెలకు సగటున 1.12కోట్ల మంది, ఏడాదికి 13.33 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు.

**దుర్వినియోగానికి చెక్**

ఇతర రాష్ట్రాల వారు నకిలీ ఆధార్ కార్డులతో ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. బతుకు తెరువు కోసం పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చిన వేలాది మహిళా కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, నకిలీ ఆధార్ కార్డుల సాయంతో బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. దీని వల్ల ఆర్టీసీకి పెద్ద మొత్తంలో ఆదాయానికి గండి పడుతోంది. ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. కార్డుల జారీ దరఖాస్తు చేసుకునే విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవడానికి, సమీప కార్డుల జారీ కేంద్రాన్ని కనుగొనడానికి టీఆర్ఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి సమారాన్ని త్వరలో పొందుపరుస్తారు. కార్డులు అందే వరకు ఆధార్ కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

## రైతన్నల సమస్యలు పరిష్కరించడంలో

# కాంగ్రెస్ సర్కార్ విఫలం: మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ జిల్లా, మే :** సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని విమర్శించారు. ఈరోజు (గురువారం) కడెం మండలంలో 'రైతుగోస- బీజేపీ భరోసా యాత్ర' నిర్వహించారు. పెద్దూర్‌తండాలో వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు పైడి రాకేశ్ రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్ పరిశీలించారు.



**ధాన్యం కుప్పలు కనపడట్లేదా..?**

ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. పంటలను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. 80శాతం ధాన్యం కొనుగోలు చేశామని చెప్పు కుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోడ్లపై, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు కనపడట్లేదా..? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఇప్పటికైనా ధాన్యం తరలింపు పనులను వేగవంతం చేయాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

**40శాతం ధాన్యం కూడా కొనలేదు..**

పంటలు పండించడం ఒక ఎత్తయితే... ఆ పంటలను అమ్ముకోవడం మరో టాస్క్‌గా మారిందని అన్నారు. నెలరోజులైనా 40శాతం ధాన్యం కూడా కొనలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని చెప్పారు. వర్షం భయంతో పంట కల్లాల వద్ద రైతులు పడికాపులు కాస్తున్నారని తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయినా ఏ మంత్రి కూడా ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు. మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను సైతం ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. తడిసిన ధాన్యాన్ని సైతం ఎలాంటి తరుగు, కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ లో ఇంటిదొంగలు..

- మొదటి పేజీ తరువాయి

తెర ముందు ఇలా బిగ్ టీవీ చేస్తుందని ఎవరూ అంచనా వేయలేదు. ఇప్పుడు మహేష్ కుమార్ గౌడ్ వర్సెస్ బిగ్ టివి యాజమాన్యానికి పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇది ఎక్కడ దాకా వెళ్తుంది.. ఎంత దాకా దారి తీస్తుందనేది చూడాల్సి ఉంది. ఆమధ్య భట్టి విక్రమార్క మీద ఆంధ్రజ్యోతి ఎండి వేమూరి రాధాకృష్ణ తన కొత్త పలుకులో బొగ్గు గనుల కేటాయింపు గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై విక్రమార్క తెర ముందుకు వచ్చారు. ఆయన కూడా తనదైన స్టైల్ లో రాధాకృష్ణ మీద విమర్శలు చేశారు. దీనికంటే ముందు ఎన్టీవీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఒక కలెక్టర్ మధ్య సంబంధం ఉన్నట్టు న్యూస్ టెలికాస్ట్ అయింది. దాని మీద ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రస్థాయిలో మండిపడింది..కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీద ఆ ఛానల్ ఆ స్థాయిలో నెగిటివ్ స్టోరీ పబ్లిష్ చేయడానికి బొగ్గు గనుల కేటాయింపు ప్రధాన కారణమని ఆంధ్రజ్యోతి ఎండి వేమూరి రాధాకృష్ణ సరికొత్త బాంబు పేల్చారు.. ఎన్ టీవీ చైర్మన్ నరేంద్ర చౌదరి అల్లుడు.. భట్టి విక్రమార్క కలిసి మైనింగ్ వ్యవహారం చేస్తున్నారని.. దానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అడ్డుపడుతున్నారని.. అందువల్లే ఆయన మీద ఎన్టీవీలో స్టోరీ పబ్లిష్ చేసినట్టు రాధాకృష్ణ చెప్పుకొచ్చారు. వాస్తవానికి మీడియా వాస్తవాలను మాత్రమే ప్రసారం చేస్తే ఇంత చర్చ ఉండేది కాదు. మీడియా అనేది రాజకీయ పార్టీకి తొత్తుగా మారిపోయిన తర్వాత.. కేవలం రివేంజ్ తీర్చుకునే వ్యవస్థ గానే అది రూపాంతరం చెందింది. గతంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మీడియా కాస్త హద్దుల్లో ఉండేది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మీడియా వ్యక్తిగత దాడులకు మాత్రమే ఉపకరించే వ్యవస్థగా దిగజారిపోయింది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న పెద్ద వ్యక్తుల చేతుల్లో పరోక్షంగా కొన్ని మీడియా సంస్థలు ఉన్నాయి. అవి ఇష్టానుసారంగా కథనాలను ప్రసారం చేస్తున్నాయి. దీనివల్ల కాంగ్రెస్ పార్టీ మరింత దారుణంగా అభాస పాలవుతోంది. ఫలితంగా పదేళ్లపాటు అధికారం కోసం ఎదురుచూసిన ఆ పార్టీ.. ఇప్పుడు ఉన్న అధికారాన్ని నిలబెట్టుకునే పరిస్థితి కూడా కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఒకరికి తెలియకుండా మరొకరు మీడియాకు లీకులు ఇచ్చుకోవడం వల్ల కాంగ్రెస్ పార్టీ పరువు బజారున పడుతోందని.. అపార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇంతటి దుస్థితిలో కూడా కాంగ్రెస్ పార్టీకి ఒక లాభదాయకమైన అంశం చోటు చేసుకుంటున్నది. అదేంటంటే క్షేత్రస్థాయిలో భారత రాష్ట్ర సమితి బలంగా లేదు కాబట్టి కాంగ్రెస్ పార్టీకి కాస్తలో కాస్త బెటర్ పొజిషన్ కనిపిస్తోంది. ఒకవేళ భారత రాష్ట్ర సమితి గనుక బలంగా ఉండి ఉంటే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి వేరే విధంగా ఉండేది. ఇప్పటికైనా ఆ నాయకులు మారాలని.. సమిష్టిగా పార్టీ విజయం కోసం కృషి చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు.

# ఈటెల, డీకేలలో ఎవరికి పదవి

- మొదటి పేజీ తరువాయి

పదవి నుంచి తొలగించడం వల్ల పార్టీ నష్టపోయిందని భావిస్తున్న హైకమాండ్, ఇప్పుడు మంత్రి పదవి నుంచి తప్పిస్తే మరింత ప్రతికూల ప్రభావం పడుతుందని అంచనా వేస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సైతం బండి సంజయ్ కుటుంబ వ్యవహారంపై డిఫెన్స్ చేస్తూ, అది చట్టపరిధిలోని అంశమని క్లీన్ చీట్ ఇచ్చే ప్రయత్నం చేశారు. కిషన్ రెడ్డి కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోకుండా మిన్నకుండిపోయారు. మంత్రివర్గంలో కొత్తగా స్థానం సంపాదించుకునేందుకు రాష్ట్రం నుంచి గట్టి పోటీ నెలకొంది. కేంద్ర మంత్రి పదవి ఆశించిన వారిలో ధర్మపురి అర్వింద్‌తో పాటు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, డీకే అరుణ ప్రధానంగా ఉన్నారు. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేస్తే ఆ పదవి తనకే దక్కుతుందని అర్వింద్ ఆశలు పెట్టుకున్నప్పటికీ, బండి కంటిన్యూ అవుతుండటంతో ఆయన ఆశలు అడియాశలయ్యేలా కనిపిస్తున్నాయి. మరోవైపు రఘునందన్ రావు పేరును అధిష్టానం సీరియస్‌గా పరిగణించడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం రేసులో అందరికంటే ముందు వరుసలో నిలిచింది ఇద్దరే. ఒకరు ఈటల రాజేందర్ కాగా, మరొకరు డీకే అరుణ. రాష్ట్రం నుంచి ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్నందున, వీరిద్దరికీ కలిపి పదవులు ఇవ్వడం కష్టమే. దీంతో ఈ ఇద్దరిలో ఆ ఛాన్స్ ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠ రేపుతోంది. ఈటల రాజేందర్ మంత్రి పదవి కోసం గట్టిగానే ప్రయత్నాలు సాగిస్తున్నారు. గతంలో పార్టీలో చేరిన సమయంలో ఆయనకు అధిష్టానం ఇచ్చిన హామీలు కూడా ఉన్నాయి. పైగా ఈటల బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడం, ఆయన సతీమణి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో, ఆయనకు పదవి ఇస్తే రెండు వర్గాల నుంచి పార్టీకి మైలేజ్ వస్తుందని బీజేపీ భావించింది. ఇందులో కిషన్ రెడ్డి అభిప్రాయం అత్యంత కీలకంగా మారనుంది. కిషన్ రెడ్డి గనుక తన వీటో పవర్ ఉపయోగిస్తే, ఈటల కంటే డీకే అరుణ వైపే ఆయన మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరి కిషన్ రెడ్డి మాటను పరిగణనలోకి తీసుకుని డీకే అరుణకు ఛాన్స్ ఇస్తారా? లేక ముందే ఇచ్చిన మాట ప్రకారం బీసీ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఈటల రాజేందర్‌ను కేబినెట్‌లోకి తీసుకుంటారా? అనేది మోదీ తుది నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

# పంచాయితీలకు నిధుల వరదేనా..?

- మొదటి పేజీ తరువాయి

పోయింది. ఫలితంగా ఎప్పుడో ఒకసారి కార్మికులకు వేతనాలు ఇస్తున్న దుస్థితి ఏర్పడింది. బకాయిలు పెరిగిపోవడం.. ఆర్థిక వృద్ధి లేకపోవడంతో పంచాయతీలు తీవ్రంగా ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి స్థితిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీరాజ్ చరిత్రలోనే సరికొత్త విధానాలకు శ్రీకారం చుట్టారు. ఇకపై వచ్చే ఆదాయాన్ని పంచాయతీ బ్యాంకు ఖాతాలలో వేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఖజానా లో వేసి తీసుకునే పద్ధతి ఉండదు. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తున్నారు. పంచాయతీలలో పనిచేసే సిబ్బందికి ఒకటవ తేదీన వేతనాలు వస్తాయి. రేవంత్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పంచాయతీలలో పనిచేస్తున్న యాభై వేల మందికి ఊరట లభిస్తుంది. ఇకపై ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతినెల 50 కోట్ల వరకు పంచాయతీలకు వెళ్తాయి. గత ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థలను మొత్తం నిర్వీర్యం చేసేందుకు ట్రెజరీ విధానాన్ని తీసుకొచ్చింది. దీనిని మార్చేందుకు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లో సెక్షన్ 70 (3) ని పూర్తిగా సవరించారు. దీనివల్ల ట్రెజరీలో పంచాయతీ ఆదాయాన్ని వేయాల్సిన అవసరం లేదు. పంచాయతీల పేరు మీద ఉన్న బ్యాంకు ఖాతాలో వేసి తీసుకోవచ్చు. వేతనాలు.. ఇతర చెల్లింపులకు వాడుకోవచ్చు. అయితే ఇవన్నీ కూడా ఆడిట్ పరిధిలో ఉంటాయి. ప్రతి పైసా కూడా జాగ్రత్తగా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. మరోవైపు కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదు. కేంద్రం ఇచ్చే నిధులు మొత్తం నేరుగా పంచాయతీలకే మంజూరు చేస్తుంది. ప్రభుత్వం కూడా తన వాటాగా డబ్బులు ఇస్తోంది. దీనివల్ల స్థానిక సంస్థలు బలోపేతమవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పంచాయతీలలో పనిచేసే కార్మికులకు అంతంత మాత్రం గానే వేతనాలు ఉంటాయి. ఆ వేతనాలు పకడ్బందీగా వస్తేనే వారి అవసరాలు తీరుతాయి. ఆ విషయాన్ని గుర్తించిన రేవంత్ రెడ్డి పంచాయతీ రాజ్ చట్టంలో పూర్తిగా మార్పులు తీసుకొచ్చారు. దీనివల్ల ఉద్యోగులకు వేతనాలు మాత్రమే కాదు.. పంచాయతీ కూడా ఆర్థికంగా బలోపేతం అవుతాయి. అతి త్వరలోనే నూతన విధి విధానాలు అమలవుతాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# కేటీఆర్ వ్యూహాత్మక మౌనమా..?

- మొదటి పేజీ తరువాయి

వరి కోతకు వచ్చిన హార్వెస్టర్ డ్రైవర్ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కెసిఆర్ ఫామ్ హౌస్ లో వరికోస్తున్నామంటూ అతడు ఒక వీడియో తీసి పోస్ట్ చేశాడు. అది కాస్త సోషల్ మీడియాలో విపరీతంగా సర్కులేట్ అవుతోంది. చివరికి కేసీఆర్ ఫామ్ హౌస్ లో వరి కోస్తున్న వీడియో కూడా ఈ తీరుగా సంచలనం సృష్టిస్తోందంటే మాటలు కాదని నెటిజన్లు అంటున్నారు.

**లైన్ దాటేస్తున్న కేటీఆర్**

కేటీఆర్ మాట్లాడుతున్నప్పుడు చాలా జాగ్రత్తగా ఉంటారు. కానీ ఇటీవల ఆయన లైన్ తప్పినట్టు కనిపిస్తోంది. ఆ మధ్య వరంగల్ లో ఒక సభ జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి మీద విమర్శలు చేస్తూ.. కొద్దిరోజుల్లో ఆయన కూర్చున్న కూర్చుని లాగి పడ దెంలిలిలి తే అని అన్నారు. ఇది ఎంత సంచలనం కావాలో అంత సంచలనమైంది. దీంతో కేటీఆర్ మీద ఉన్న అభిప్రాయం కాస్త చాలామందిలో తగ్గిపోయింది. ఇప్పుడిక కేటీఆర్ హైదరాబాదులో జరిగిన ఓ మీటింగ్లో తన తండ్రి పార్టీని నిలబెట్టడానికి పడిన కష్టాన్ని వివరించే క్రమంలో.. ఒకప్పుడు కెసిఆర్ పరిస్థితి పార్టీని పెట్టినప్పుడు "గాలి వానలో.. వాన నీటిలో" అన్నట్టుగా ఉండేదని వ్యాఖ్యానించారు. దీని ముందు ఏం జరిగింది.. దీని తర్వాత ఏం జరిగింది అనే విషయాన్ని ఎవరూ పట్టించుకోరు.

# ఇమ్యూనిటీని 10 రెట్లు పెంచే స్పెషల్ డ్రింక్..



**ఉదయాన్నే తాగితే శరీరంలో జరిగే అద్భుతాలు ఇవే..**

ప్రకృతిలో ఎన్నో రకాల సహజ సిద్ధమైన ఔషధ మొక్కలు ఉన్నాయి.. అలాంటి వాటి గురించి చాలా మందికి తెలియదు.. అయితే.. ప్రకృతి ప్రసాదించిన మొక్కల గురించి తెలుసుకుంటే ఎన్నో సమస్యలను దూరం చేసుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అలాంటి పవర్‌ఫుల్ మొక్కల్లో తిప్పతీగ ఒకటి.. వాస్తవానికి సీజనల్ మార్పులు, వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల తరచుగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలలో జలుబు, దగ్గు, కఫం, శ్లేష్మాలు, ఇతర ఇన్ఫ్లమేషన్లు .. పలు సమస్యలు ఉంటాయి.. ముఖ్యంగా అన్ని సీజన్లలో, వర్షాలు కురిసేటప్పుడు, వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ ఇన్ఫ్లమేషన్ల నుండి రక్షణ కల్పించి, శరీరంలో రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి తిప్పతీగ (గుడుచి) కషాయం అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది.

**తిప్పతీగ కషాయం మూడు ప్రధాన మార్గాలలో రోగనిరోధక వ్యవస్థకు తోడ్పడుతుంది:**

1. క్రిములను నాశనం చేయడంలో సహాయం: చల్లని వాతావరణంలో శరీరంలోకి బాక్టీరియా -- వైరస్‌లు సులభంగా ప్రవేశిస్తాయి. తిప్పతీగలోని 15 రకాల ఆల్కలాయిడ్స్, 6 రకాల గ్లైకోసైడ్స్ రక్తంలో గస్తీ కాసే మాక్రోఫేజ్ కణాలను శక్తివంతం చేస్తాయి. ఈ మాక్రోఫేజ్ కణాలలోని లైసోజోమ్‌ల సంఖ్యను పెంచడం ద్వారా, వైరస్‌లు, బాక్టీరియాలు వేగంగా నాశనం అవుతాయి. లైసోజోమ్‌లు క్రిములను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేసి, వాటిని భస్మం చేస్తాయి. ఇది శరీరాన్ని ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతుంది.

2. ఇన్ఫ్లమేషన్‌ను నియంత్రించడం: సీజనల్ మార్పుల వల్ల శరీరంలో ఇన్ఫ్లమేషన్ పెరుగుతుంది. ఈ ఇన్ఫ్లమేషన్ విడుదల చేసేవి శ్లేష్మం, కఫం వంటి వాటికి కారణమవుతాయి. తిప్పతీగలోని 16 రకాల ఆల్కలాయిడ్స్, 6 రకాల గ్లైకోసైడ్స్ ఈ ఇన్ఫ్లమేటరీ మీడియేటర్స్‌ను నాశనం చేసి, ఇన్ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. తద్వారా, జలుబు, దగ్గు, కఫం వంటి లక్షణాలు తగ్గుతాయి.

3. యాంటీబాడీల ఉత్పత్తిని పెంచడం: వైరస్‌లు, బాక్టీరియాలు శరీరంపై దాడి చేసినప్పుడు, తిప్పతీగ కషాయం వాటిని నాశనం చేయడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి ఇన్ఫెక్షన్లు రాకుండా రక్షించే యాంటీబాడీల ఉత్పత్తిని కూడా ప్రోత్సహిస్తుంది. ఇది దీ సెల్స్ -- ు హెల్పర్ సెల్స్ ఉత్పత్తిని గణనీయంగా పెంచుతుంది. దీ సెల్స్ వైరస్‌లకు వ్యతిరేకంగా యాంటీబాడీలను తయారు చేస్తాయి. ఈ కణాల పెరుగుదల వల్ల రోగనిరోధక వ్యవస్థ మరింత చురుకుగా పనిచేస్తుంది. తద్వారా శరీరం ఎక్కువ కాలం వ్యాధి రహితంగా ఉంటుంది.

తిప్పతీగ కషాయం తయారీ -- వాడకం:

పల్లెటూర్లలో తాజా తిప్పతీగ ఆకులు సులభంగా లభిస్తాయి. 10-20 ఆకులను నీటిలో వేసి బాగా మరిగించి, వడకట్టి, తేనె కలుపుకుని తాగవచ్చు. నగరాలలో నివసించే వారు తిప్పతీగ పొడిని ఉపయోగించవచ్చు. ఒక గ్లాసు నీటిలో ఒక టేబుల్ స్పూన్ తిప్పతీగ పొడి వేసి, అది అర గ్లాసు అయ్యేవరకూ మరిగించి, వడకట్టి, తేనె కలుపుకుని తాగాలి. ఫాస్టింగ్‌లో ఉన్నప్పుడు కూడా తేనెతో కలిపి ఈ కషాయాన్ని తీసుకోవచ్చు.

అయితే.. తిప్పతీగ కషాయాన్ని చాలామంది రోగనిరోధక శక్తిని పెంచడానికి ఉపయోగిస్తారు. ఇప్పటికే.. దాని సామర్థ్యం గురించి అన్నో అధ్యయనాలు వివరించాయి. సాధారణ బాక్టీరియల్ లేదా వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు లేదా సీజనల్ మార్పుల వల్ల శరీరం బలహీనపడినప్పుడు తిప్పతీగ కషాయం తీసుకోవడం మంచిది. క్రమం తప్పకుండా 10-15 రోజులు తాగడం వల్ల కొన్ని నెలల పాటు రోగనిరోధక శక్తి చురుకుగా ఉండి, ఇన్ఫ్లమేషన్, అనారోగ్యాల నుండి రక్షణ లభిస్తుంది.

# రోజంతా గంటల తరబడి కూర్చుని పనిచేసేవారికి అలర్ట్.. ఈ సమస్యలు వచ్చే ప్రమాదం అధికం..

ఆధునిక జీవనశైలిలో రోజుకు 8 గంటలకు పైగా కూర్చునే అలవాటు చాలా మందికి సాధారణంగా మారిపోయింది. ఆఫీసులో కంప్యూటర్ ముందు పని చేయడం, ట్రాఫిక్‌లో ఎక్కువసేపు డ్రైవింగ్ చేయడం లేదా ఇంటికి వచ్చాక కూడా మొబైల్, టీవీల ఎదుట గంటల తరబడి కూర్చోవడం వల్ల శరీరంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా కాళ్లలో రక్త ప్రసరణ దెబ్బతిని, భవిష్యత్తులో రక్తనాళాల సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం సహజంగా కదలికల కోసం నిర్మాణమైందని, కానీ ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కాళ్ల కండరాలు పనిచేయకుండా పోతాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా కాళ్ల కండరాల కదలికలే రక్తాన్ని తిరిగి గుండె వైపు పంపించడంలో సహాయపడతాయి. అయితే గంటల తరబడి కూర్చుంటే ఈ ప్రక్రియ మందగించి రక్తం కాళ్లలోనే నిలిచిపోవడం ప్రారంభమవుతుంది. దీని వల్ల క్రమంగా రక్తనాళాల పనితీరు దెబ్బతింటుందని పేర్కొంటున్నారు.


**వాపులు రావడం..**

కాళ్లలో రక్త ప్రసరణ సరిగా లేకపోతే మొదట కనిపించే ముఖ్య లక్షణాల్లో ఒకటి మడమలు, పాదాలు, కాళ్ల దిగువ భాగంలో వాపు రావడం. దీన్ని పెరిఫెరల్ ఎడిమా అని పిలుస్తారు. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల రక్తం కాళ్లలో నిలిచిపోవడంతో ద్రవం చర్మ కణజాలాల్లోకి చేరి వాపులకు కారణమవుతుంది. రోజు ముగిసే సమయానికి చెప్పులు బిగుతుగా అనిపించడం లేదా సాక్స్ తీసేసిన తర్వాత మడమల వద్ద గాట్లు కనిపించడం ఈ సమస్యకు సంకేతాలుగా చెప్పవచ్చు. అలాగే స్పైడర్ వీన్స్, వెరికోస్ వీన్స్ కనిపించడం కూడా ఇంకో ముఖ్య హెచ్చరిక సంకేతంగా చెప్పవచ్చు. సాధారణంగా రక్తనాళాల్లో ఉండే చిన్న వాల్వులు రక్తం వెనక్కి వెళ్లకుండా అడ్డుకుంటాయి. కానీ ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కాళ్లలో ఒత్తిడి పెరిగి ఈ వాల్వులు బలహీనపడతాయి. ఫలితంగా చర్మం కింద ఎరుపు, నీలం లేదా ఊదా రంగులో సన్నని రక్తనాళాలు కనిపించడం ప్రారంభమవుతుంది. మరింత తీవ్రమైతే పెద్దగా వాపులకు గురై, మెలికలు తిరిగిన నీలి రంగు రక్తనాళాలు బయటకు కనిపిస్తాయి. ఇవి కేవలం అందానికి సంబంధించిన సమస్యలే కాకుండా రక్త ప్రసరణలో లోపానికి సంకేతాలని వైద్యులు చెబుతున్నారు.

**డీప్ వెయిన్ థ్రాంబోసిస్..**

చాలాసేపు కూర్చున్న తర్వాత కాళ్లలో చిమ్మటలు రావడం, నిస్సత్తువగా అనిపించడం లేదా సూదులతో గుచ్చినట్లుగా అనిపించడం కూడా ప్రమాద సూచికలుగా చెబుతున్నారు. రక్త ప్రసరణ తగ్గిపోవడంతో నరాలకు సరైన ఆక్సిజన్, పోషకాలు అందక ఈ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా కాళ్లు ముడుచుకుని కూర్చోవడం లేదా సరైన కుర్చీలు ఉపయోగించకపోవడం వల్ల నరాలపై ఒత్తిడి పెరిగి పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఎక్కువసేపు కదలకుండా ఉండటం వల్ల వచ్చే అత్యంత ప్రమాదకర పరిస్థితి డీప్ వెయిన్ థ్రాంబోసిస్ (ణఖ). కాళ్ల లోతైన రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల ఈ సమస్య వస్తుంది. ఆ గడ్డ రక్తప్రసరణ ద్వారా ఊపిరితిత్తులకు చేరితే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

**చిన్న చిన్న అలవాట్లే..**



ఈ సమస్యలను నివారించడానికి చిన్న చిన్న అలవాట్లే చాలనని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి 30 నుంచి 60 నిమిషాలకు ఒకసారి లేచి నడవడం, స్ట్రెచింగ్ చేయడం, కాళ్ల వ్యాయామాలు చేయడం మంచిది. కూర్చునేటప్పుడు రెండు కాళ్లను నేలపై సరిగా ఉంచడం, కాళ్లు మడవకుండా ఉండడం, రోజులో కొంతసేపు కాళ్లను గుండె స్థాయి కంటే ఎత్తుగా పెట్టుకుని విశ్రాంతి తీసుకోవడం ద్వారా రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రోజంతా కుర్చీలో కూర్చోవడం తప్పనిసరి అయినా, కాళ్ల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. చిన్న లక్షణాలను ముందుగానే గుర్తిస్తే భవిష్యత్తులో తీవ్రమైన రక్తనాళాల సమస్యలను నివారించవచ్చు.




# అనన్యా పాండే డ్యాన్స్‌పై ట్రోలింగ్..

## కూతురుకి మద్దతుగా నిలిచిన చుంకీ పాండే!

బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే నటించిన తాజా చిత్రం 'చంద్ మేరా దిల్' లోని ఒక చిన్న డ్యాన్స్ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఆమె తీవ్ర స్థాయిలో ట్రోలింగ్‌ను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో అనన్య చేసిన భరతనాట్యం స్టెప్పులపై క్లాసికల్ డ్యాన్సర్లు, నెటిజన్లతో పాటు కొందరు రాజకీయ నాయకులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తూ, శాస్త్రీయ నృత్యాన్ని ఆమె అవమానించిందంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఆమె తండ్రి, ప్రముఖ నటుడు చుంకీ పాండే తన కుమార్తెకు మద్దతుగా నిలుస్తూ ట్రోలర్లకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ప్రజలు కనీసం ఆ డ్యాన్స్ వెనుక ఉన్న సందర్భాన్ని అర్థం చేసుకోకుండానే విమర్శలు గుప్పిస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ఎంతమాత్రం సాంప్రదాయ భరతనాట్యం కాదని, కేవలం కాలేజీ రోజుల్లో విద్యార్థులు సాంస్కృతిక వేడుకల్లో చేసే ఒక రకమైన ప్రయోగాత్మక ఫ్యూజన్ డ్యాన్స్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. స్వచ్ఛమైన భరతనాట్యం నేర్చుకోవడానికి దాదాపు 20 ఏళ్ల కఠోర సాధన, క్రమశిక్షణ అవసరమని, అది ఎంతో సాంకేతికతతో కూడుకున్నదని చెబుతూ, ఈ సినిమాలో చూపించింది కేవలం సంప్రదాయ నృత్య మూలాలతో కూడిన భవిష్యత్ అడ్వాన్స్‌డ్ డ్యాన్స్ రూపాల కలయికే తప్ప శాస్త్రీయ ప్రదర్శన కాదని వివరించారు. కాబట్టి సినిమా చూడకుండా ఎవరూ తొందరపడి స్పందించవద్దని ఆయన కోరారు. మరోవైపు ఈ చిత్ర అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ అనన్య ఆర్. కురుప్ కూడా నటి అనన్యా పాండేకు మద్దతుగా నిలిచారు. షూటింగ్ సెట్స్‌కు సంబంధించిన కొన్ని తెరవెనుక చిత్రాలను పంచుకుంటూ, తన కంఫర్ట్ జోన్ దాటి ఒక సరికొత్త శాస్త్రీయ నృత్య రూపాన్ని ప్రయత్నించడానికి చాలా ధైర్యం, అంకితభావం కావాలని ఆమె పేర్కొన్నారు. భరతనాట్యంలో పట్టు సాధించడానికి ఎన్నో ఏళ్లు పడుతుందని, కానీ అనన్య చాలా తక్కువ సమయంలోనే ఎంతో కష్టపడి తన నటనతో మెప్పించిందని ప్రశంసించారు.

# 'కాంతార' వివాదం: మైసూర్ చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న రణవీర్ సింగ్



బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ మంగళవారం ఉదయం కర్ణాటకలోని మైసూర్‌లో గల ప్రముఖ చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా ముగింపు వేడుకల్లో రణవీర్ సింగ్, నటుడు రిషబ్ శెట్టి నటించిన 'కాంతార' చిత్రంలోని పవిత్రమైన భూతకోల నృత్యాన్ని అనుకరిస్తూ ప్రదర్శన ఇవ్వడం పెద్ద వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో దైవాన్ని ఉద్దేశించి చేసిన కొన్ని వ్యాఖ్యలు కన్నడిగుల, దైవ భక్తుల మతాచారాలను, సెంటిమెంట్లను గాయపరిచాయంటూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడమే కాకుండా, ఒక లాయర్ ఇచ్చిన ఫిర్యాదుతో రణవీర్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ (ఖీ×=) కూడా నమోదైంది. ఈ వివాదంపై రణవీర్ సింగ్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించి, తాను ఎవరి భావాలను దెబ్బతీయాలని అలా చేయలేదని, రిషబ్ శెట్టి నటనపై గౌరవంతోనే చేశానని చెబుతూ కోర్టుకు నిరభ్యంతర క్షమాపణలు సమర్పించారు. ఆయన క్షమాపణలను స్వీకరించిన హైకోర్టు, రణవీర్ సింగ్‌పై ఉన్న కేసును కొట్టివేస్తూ, ప్రాయశ్చిత్తంగా నాలుగు వారాల లోపు మైసూర్ చాముండేశ్వరి దేవిని దర్శించుకోవాలని ఆదేశించడంతో, ఆ గడువు ముగిసేలోపే ఆయన అత్యంత రహస్యంగా మైసూర్ చేరుకుని సాధారణ భక్తుడిలా మాస్క్ ధరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో దాదాపు పది నిమిషాల పాటు గడిపిన రణవీర్ సింగ్‌ను ఆ తర్వాత పూజారులు గుర్తించి ప్రత్యేకంగా సత్కరించారు. అయితే ఈ ఆలయ దర్శనానికి సరిగ్గా ఒక్క రోజు ముందే రణవీర్ సింగ్‌కు చిత్ర పరిశ్రమ నుంచి ఊహించని షాక్ తగిలింది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో తెరకెక్కాల్సిన ప్రతిష్టాత్మక చిత్రం 'డాన్ 3' నుండి రణవీర్ సింగ్ అకస్మాత్తుగా తప్పుకోవడంతో నిర్మాతలకు దాదాపు 45 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందనే కారణంతో, 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే రణవీర్ సింగ్‌తో లైట్‌మెన్, కెమెరామెన్, స్పాట్ బాయ్స్ వంటి ఏ సినీ కార్మికుడూ సహకరించకూడదంటూ 'సహాయ నిరాకరణ' నోటీసులు జారీ చేస్తూ నిషేధం విధించింది. ఈ వివాదం సర్దుమణిగే వరకు రణవీర్‌తో ఎవరూ పనిచేయరని ఆ సంస్థ స్పష్టం చేసింది. ఇలా ఒకవైపు 'కాంతార' వివాదంలో కోర్టు ఆదేశాల మేరకు చాముండేశ్వరి దేవి ఆలయాన్ని సందర్శించడం, మరోవైపు 'డాన్ 3' వివాదం కారణంగా బాలీవుడ్ ఫిల్మ్ బాడీ నిషేధాజ్ఞలను ఎదుర్కోవడం ప్రస్తుతం సినిమా పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# సొంతూరు జాతరలో దేవిశ్రీ ప్రసాద్ మాస్ సందడి..



టాలీవుడ్‌లో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న 'రాక్‌స్టార్' దేవిశ్రీ ప్రసాద్ మరోసారి తన సొంత గ్రామంపై ఉన్న ప్రేమను చాటిచెప్పారు. సంగీతంతో కోట్లాది మంది అభిమానులను అలరిస్తున్న డీఎస్పీ, తన మూలాలను మాత్రం ఎప్పటికీ మర్చిపోనని మరోసారి నిరూపించారు. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ తన సొంత ఊరు, అక్కడి సంప్రదాయాలు, గ్రామీణ సంస్కృతితో ఆయనకున్న అనుబంధం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరం మండల పరిధిలో ఉన్న వెదురుపాక గ్రామం దేవిశ్రీ ప్రసాద్ కుటుంబానికి ప్రత్యేకమైన ప్రదేశం. ఆయన తండ్రి, దివంగత రచయిత సత్యమూర్తి స్వస్థలం కావడంతో ఈ గ్రామంతో డీఎస్పీకి చిన్ననాటి నుంచే ఆత్మీయ బంధం ఉంది. ఇటీవల వెదురుపాకలో ఘనంగా నిర్వహించిన పోలేరమ్మ అమ్మవారి జాతరలో దేవిశ్రీ ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. సెలబ్రిటీ హోదాను పక్కనపెట్టి గ్రామస్తులతో కలిసిమెలిసి జాతరలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం డీఎస్పీ స్థానిక గరగ నృత్య కళాకారులతో కలిసి ఉత్సాహంగా స్టెప్పులు వేయడం అక్కడి వారిని ఆనందంలో ముంచెత్తింది. జాతరలో గ్రామీణ వాతావరణంలో ఆయన చేసిన డ్యాన్స్, ప్రజలతో కలిసిపోయిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానులు కూడా "ఇదే అసలు డీఎస్పీ స్టైల్", "స్టార్ అయినా గ్రామాన్ని మర్చిపోలేదు" అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక దేవిశ్రీ ప్రసాద్ జాతరలో చేసిన సందడిని ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ఎల్లమ్మ టీమ్ ప్రత్యేకంగా ఉపయోగించుకుంది. జాతరలోని వీడియోలు, కోనసీమ ప్రకృతి అందాలు, పోలేరమ్మ ఆలయంలో డీఎస్పీ పూజలు, గ్రామీణ కళాకారులతో కలిసి చేసిన డ్యాన్స్ క్షణాలను సేకరించి ప్రత్యేక వీడియోగా రూపొందించింది. ఈ వీడియోకు "ఇఖ్రా రాష్ట్రశీషం ఎష్ట్రవ రాజూఅతీఙ్ రాట ఎఅం ఎఅశ్రీశ్రీఖస్త్రవ జీఫ్ష్టుతీఖు" అనే టైటిల్‌ను పెట్టి విడుదల చేశారు. ఇందులో గ్రామీణ సంస్కృతి, జాతర ఉత్సాహం, డీఎస్పీ మాస్ ఎనర్జీ అన్నీ కలగలిపి చూపించారు. ముఖ్యంగా 'ఎల్లమ్మ' సినిమా గ్లింప్స్‌లో వినిపించిన జానపద బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో ఈ వీడియోను ఎడిట్ చేయడం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. ఎల్లమ్మ సినిమాకి డీఎస్పీ కేవలం హీరోగానే కాకుండా సంగీత దర్శకుడిగానూ తన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో, ఎల్లమ్మ అమ్మవారి ఆరాధన చుట్టూ తిరిగే కథతో రూపొందుతున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది.



# ఇండస్ట్రీలో నాకు ఇష్టమైన హీరోయిన్ ఆమెనే.. కలిసి కెరీర్ స్టార్ట్ చేశాం..

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు హీరోగా దూసుకుపోయిన నటుడు సుమన్. ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేశారు. కానీ ఆ తర్వాత నెమ్మదిగా గ్రాఫ్ తగ్గిపోయింది. ఆ తర్వాత కంటెంట్ ప్రాధాన్యతను బట్టి సహాయ నటుడిగా కనిపించి మెప్పించారు. బుల్లితెరపై పలు సీరియల్స్, వెండితెరపై వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. తన సినీ ప్రయాణం, ప్రాజెక్టులు, తన అభిమాన సహనటి గురించి చెప్పుకొచ్చారు. మంగళూరులో పుట్టి, చెన్నైలో విద్యనభ్యసించి, కోలీవుడ్‌లో అడుగుపెట్టి, టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. "కౌబాయ్", "లవ్ బాయ్" , మార్షల్ ఆర్ట్స్‌తో "కరాటే బాయ్" వంటి విభిన్నమైన పాత్రలను పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. నిజాయితీ గల పోలీస్ అధికారిగా, వ్యవస్థ మీద పోరాటం చేసే నాయకుడిగా, అమాయకమైన బావమరిదిగా, అలాగే అన్నమయ్యను ఆశీర్వదించిన వెంకటేశ్వర స్వామిగా పలు మరపురాని పాత్రలతో సుమన్ అలరించారు.

ప్రస్తుతం సుమన్ తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో చురుకుగా నటిస్తున్నారు. ఇటీవల ఒరియా చిత్రాల్లో కూడా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఒక ఒరియా చిత్రంలో తెలుగు , ఒరియా వెర్షన్లకు ఒకే పాత్రను పోషించే అవకాశం లభించిందని తెలిపారు. వివిధ భాషల్లో సంభాషణలను సులభంగా అర్థం చేసుకోవడానికి, వాటిని ఇంగ్లీష్ లో వ్రాసుకుంటానని ఆయన వెల్లడించారు. ముగ్గురు అందమైన నటీమణులలో తన బెస్ట్ కోస్టార్ ఎవరని అడిగినప్పుడు, సుమన్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తాను విజయశాంతితో, భానుప్రియతో ఎక్కువగా నటించినట్లు పేర్కొన్నారు. అయితే, తన అభిమాన సహనటి విజయశాంతి అని స్పష్టం చేశారు. వారిద్దరి మధ్య ఉన్న అద్భుతమైన కెమిస్ట్రీ, ఇద్దరూ తమ కెరీర్‌ను దాదాపు ఒకే సమయంలో ప్రారంభించడం,, "నేటి భారతం" చిత్రం ద్వారా స్టార్‌డమ్ సాధించడం వంటి కారణాలను సుమన్ ప్రస్తావించారు. వారి జోడీ విజయం వెనుక వారి నటన కీలకమని ఆయన అన్నారు. తనకు ఇష్టమైన పాటల గురించి మాట్లాడుతూ, "బావ బావమరిది" చిత్రం నుండి గజ్జగల్లు మన్నది, "20వ శతాబ్దం" చిత్రం నుండి అమ్మని మించిన దైవం ఉన్నదా, తన మొదటి చిత్రం "తరంగిణి" నుండి తరంగిణి ఓ తరంగిణి వంటి పాటలను తనకు ఇష్టమైన పాటలు అని అన్నారు పేర్కొన్నారు.

# బిజినెస్

## తగ్గిన బంగారం ధరలు.. రూ.5 వేలు తగ్గిన వెండి




ఇవాళ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు పతనమయ్యాయి. ఇరాన్ పై అమెరికా సైన్యం తాజాగా దాడులు జరపడంతో సురక్షిత పెట్టుబడులుగా భావించే ఈ లోహాలపై అమ్మకాల ఒత్తిడి పెరిగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో బంగారం ఫ్యూచర్స్ సుమారు రూ.1,000 వరకు పడిపోయాయి. ఇక వెండి ఫ్యూచర్స్‌లో కూడా దాదాపు 2 శాతం మేర క్షీణత కనిపించింది. మంగళవారం ఉదయం 10:25 గంటల సమయంలో ఎంసీఎక్స్‌లో జూన్ 5 గోల్డ్ ఫ్యూచర్స్ 0.61% నష్టంతో రూ.971 తగ్గి రూ.1,58,110 వద్ద ట్రేడ్ అయింది. ఇంట్రాడేలో రూ.1,58,000 కనిష్ఠ స్థాయిని తాకింది. మరోవైపు జూలై 3 సిల్వర్ ఫ్యూచర్స్ కూడా అమ్మకాల ఒత్తిడికి గురైంది. ఇంట్రాడేలో సుమారు 2% నష్టంతో రూ.5,000 కంటే ఎక్కువగా పతనమై రూ.2,71,972 కనిష్ఠాన్ని నమోదు చేసింది. కాగా, దక్షిణ ఇరాన్‌లోని క్షిపణి ప్రదేశాలు, పడవలపై అమెరికా సైన్యం దాడులు జరపడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. చర్చల కోసం ఇరాన్ తమ ప్రతినిధులను దోహాకు పంపిన సమయంలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. అయితే అమెరికా దీనిని 'ఆత్మరక్షణ' చర్యగా పేర్కొన్నది. ఇదిలావుంటే ఈ భౌగోళిక ఉద్రిక్తతల కారణంగానే బులియన్ మార్కెట్లో ధరలు ప్రభావితమయ్యాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### అటల్ పెన్షన్ యోజన కొత్త రికార్డు!

సామాజిక భద్రతా పథకం 'అటల్ పెన్షన్ యోజన' (ఏపీవై) కింద సభ్యుల సంఖ్య ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026--27) 10 కోట్ల మార్క్‌ను అధిగమిస్తుందని పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి మండలి (పీఎఫ్ఆర్‌డీఏ) చైర్మన్ ఎస్ రామన్ తెలిపారు. 2026 మార్చి చివరికి ఏపీవై సభ్యులు 8.96 కోట్లుగా ఉన్నట్టు చెప్పారు. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2025 మార్చి నాటికి)లో సభ్యుల సంఖ్య 7.61 కోట్లతో పోల్చితే, గత ఆర్థిక సంవత్సరంలో 1.35 కోట్ల మంది కొత్త సభ్యులు జతయ్యారు. 18 శాతం వార్షిక వృద్ధి అంచనా ఆధారంగా సభ్యుల సంఖ్య 10 కోట్ల మార్క్‌ను అధిగమిస్తుందని అంచనా వేస్తున్నట్టు రామన్ పేర్కొన్నారు. ఎన్‌పీఎస్ కూడా పీఎఫ్ఆర్‌డీఏ నియంత్రణల కిందే నడుస్తుండడం గమనార్హం. 18--25 ఏళ్ల వయసు వారి నుంచి ఎక్కువ మంది సభ్యులు చేరుతున్నారని.. దీర్ఘకాల ఆర్థిక భద్రతపై యువతలో అవగాహన పెరుగుతుండడాన్ని ఇది సూచిస్తున్నట్టు రామన్ చెప్పారు. ఎన్‌పీఎస్ కింద 2026 మార్చి నాటికి 2.17 కోట్ల మంది సభ్యులు ఉండగా, వీరికి సంబంధించి రూ.15.95 లక్షల కోట్ల పింఛను నిధి నిర్వహణలో ఉన్నట్టు రామన్ తెలిపారు. ఈ ఏడాది ఎన్‌పీఎస్ సభ్యుల సంఖ్య 22 శాతం పెరగొచ్చని అంచనా వేశారు

## ఇరాన్ క్షిపణి కేంద్రాలపై అమెరికా దాడులు..

# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం తీవ్ర ఒడిదుడుకులతో సాగి చివరికి నష్టాలతో ముగిశాయి. గడిచిన సెషన్‌లో అమెరికా-ఇరాన్ శాంతి చర్చల పురోగతితో దాదాపు వెయ్యి పాయింట్లకుపైగా లాభపడ్డ మార్కెట్లు.. ఇవాళ ఆ జోరును కొనసాగించలేకపోయాయి. దక్షిణ ఇరాన్‌లోని క్షిపణి కేంద్రాలపై అమెరికా దళాలు మళ్లీ దాడులు ప్రారంభించాయన్న వార్తలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలలో మళ్లీ కనిపిస్తున్న కదలికలు మదుపరులలో ఆందోళనలను పెంచాయి. దీనికి తోడు ఇవాళ నెలవారీ డెరివేటివ్స్ ఆప్షన్స్ గడువు ముగిసే రోజు కావడంతో మార్కెట్లలో హెచ్చుతగ్గులు మరింత తీవ్రమయ్యాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి దేశీయ బెంచ్‌మార్క్ సూచీలు దాదాపు అర శాతం మేర నష్టపోయాయి. అంతకుముందు సెషన్‌తో పోలిస్తే బీఎస్ఈ సెన్సెక్స్ సుమారు 479 పాయింట్లు క్షీణించి 76,009.7 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సైతం కీలకమైన 24,000 మార్కును కోల్పోయి దాదాపు 118 పాయింట్ల నష్టంతో 23,913.7 పాయింట్ల వద్ద ముగిసింది. మార్కెట్‌లు ఉదయం నష్టాలతో ప్రారంభమైనప్పటికీ ఒక దశలో ఐటీ, ఆటో రంగాల మద్దతుతో కోలుకున్నాయి. మధ్యాహ్నం తర్వాత ఫైనాన్స్, రియల్టీ రంగాలలో పెరిగిన లాభాల స్వీకరణ కారణంగా దలాల్ స్ట్రీట్ మళ్లీ రెడ్ జోన్‌లోకి జారుకుంది. ఈ ప్రతికూల పరిస్థితుల్లోనూ కొన్ని దిగ్గజ




కంపెనీల షేర్లు కొనుగోళ్ల మద్దతును పొంది లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు నేటి ట్రేడింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, దాదాపు 3.92 శాతం లాభంతో రూ. 2,961.3 వద్ద స్థిరపడింది. ఆటోమొబైల్ రంగానికి చెందిన టాటా మోటార్స్ షేరు కూడా 3.58 శాతం వృద్ధితో రూ. 386.6 వద్ద ముగిసింది. ఐటీ విభాగం నుండి టెక్ మహీంద్రా షేరు 0.96 శాతం లాభపడి రూ.1,449.3 వద్ద ముగియగా, ఎటర్నల్ లిమిటెడ్ షేరు 0.84 శాతం లాభాన్ని నమోదు చేసింది.

# ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరించిన ఫెరారీ

**న్యూఢిల్లీ:** లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఫెరారి కొత్తగా పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ కారను ఆవిష్కరించింది. లూస్ అనే ఆ కారు ఖరీదు సుమారు ఆరున్నర లక్షల డాలర్లు. ఇటలీ బ్రాండ్ ఫెరారీ కంపెనీ తొలిసారి ఫైవ్ సీటర్ వాహనాన్ని తయారు చేసింది. లవ్‌ఫ్రమ్ ఏజెన్సీ సహకారంతో దీన్ని డిజైన్ చేశారు. సోషల్ మీడియాలో కొత్త ఎలక్ట్రిక్ ఫెరారీ కారుపై ప్రశంసలు కురుస్తున్నాయి. మాస్టర్‌క్లాస్ డిజైన్‌లో ఉన్నట్లు కొందరు పేర్కొన్నారు. అయితే ఎలక్ట్రిక్ కార్ల వ్యాపారంలో ప్రస్తుతం డిమాండ్ తక్కువగా ఉంది. దీంతో సూపర్ కార్లు తయారు చేసే లాంబోర్గిని, పోర్షే కంపెనీలు ప్రస్తుతం ఈవీ కార్లను అనుకున్నంత ఉత్పత్తి చేయడం లేదు. చైనా బ్రాండ్ల నుంచి తీవ్రమైన పోటీ ఉన్న నేపథ్యంలోనూ లగ్జరీ కంపెనీలు ఈవీ కార్లను లాంచ్ చేయలేకపోతున్నాయి. లూస్ అంటే ఇటలీ భాషలో కాంతి అని, ఈ కారును డెవలప్ చేసేందుకు అయిదేళ్లు పట్టిందని ఫెరారీ సీఈవో బెనడెట్టో విగ్నా తెలిపారు. లూస్ ఎలక్ట్రిక్ కారు వీల్స్‌కు ఎలక్ట్రిక్ మోటార్లు ఉన్నాయని, కేవలం 2.5 సెకన్లలో ఆ కారు 96 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని ఫెరారీ నిపుణులు చెబుతున్నారు. కారుకు



సంబంధించిన అన్ని పరికరాలను ఇన్‌హౌజ్‌లోనే తయారీ చేసినట్లు చెప్పారు.

# అర్ష్‌దీప్ సింగ్‌కు ఏమైంది..

## ఏకంగా 200లకుపైగా పోస్ట్‌లు డిలీట్.. అసలు రీజన్ అదేనా..?

భారత క్రికెట్ జట్టు యువ పేసర్, పంజాబ్ కింగ్స్ ఆటగాడు అర్ష్‌దీప్ సింగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో జరిగిన ఒక ఊహించని పరిణామం ఇప్పుడు క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మైదానంలోనే కాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ ఎంతో చురుగ్గా ఉంటూ అభిమానులను అలరించే ఈ స్పీడ్‌స్టర్, తాజాగా తన ఖాతా నుంచి ఏకంగా 200కు పైగా పోస్టులను తొలగించి అందరికీ పెద్ద షాక్ ఇచ్చాడు.

**నెట్టింట అర్ష్‌దీప్ సంచలన నిర్ణయం..**

క్రికెట్ ప్రపంచంలో అర్ష్‌దీప్ సింగ్ ఆటతీరుతో పాటు ఆయన చేసే వినోదాత్మక వీడియోలకు, రీల్స్‌కు విపరీతమైన ఆదరణ ఉంది. తీరిక సమయం దొరికినప్పుడల్లా తోటి ఆటగాళ్లతో కలిసి సరదాగా వీడియోలు చేస్తూ అభిమానులతో పంచుకోవడం ఆయనకు అలవాటు. అయితే, తాజాగా ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ పేజీని పూర్తిగా ప్రక్షాళన చేశాడు. ప్రస్తుతం ఆయన ఖాతాలో కేవలం 44 పోస్టులు మాత్రమే మిగిలాయి. అందులోనూ ఎక్కువ భాగం వివిధ వ్యాపార ప్రకటనలకు సంబంధించినవే కావడం గమనార్హం.

**కోహ్లీతో చేసిన రికార్డు వీడియో కూడా మాయం..!**

గత ఏడాది డిసెంబర్ నెలలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో కలిసి అర్ష్‌దీప్ చేసిన ఒక ప్రత్యేక వీడియో సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించింది. దాదాపు 15 మిలియన్లకు పైగా వీక్షణలు (వ్యూస్) సాధించిన ఆ అరుదైన వీడియోను సైతం అర్ష్‌దీప్ ఇప్పుడు తొలగించాడు. దీంతో ఆరాధ్య ఆటగాడికి అసలు ఏమైంది? ఎందుకిలా పాత జ్ఞాపకాలన్నింటినీ చెరిపేస్తున్నాడంటూ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక బలమైన కారణాలే ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**వివాదాల సుడిగుండంలో యువ పేసర్..**

గత కొన్ని రోజులుగా అర్ష్‌దీప్ సోషల్ మీడియాలో ఏ పోస్ట్ పెట్టినా అది కాస్తా వివాదాలకు దారితీస్తోంది. కొద్దిరోజుల క్రితం ఆయన విమాన ప్రయాణంలో ఉన్నప్పుడు తీసిన ఒక వీడియో తీవ్ర దుమారం రేపింది. ఆ వీడియోలో తోటి ఆటగాడు యుజ్వేంద్ర చాహల్ ఈ-సిగరెట్ (వేపింగ్) కాలుస్తూ కెమెరాకు దొరికిపోయాడు. ఈ సంఘటన క్రీడా




వర్గాల్లో తీవ్ర విమర్శలకు దారితీయడంతో, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీవ్రంగా స్పందించింది. లీగ్ మ్యాచ్‌లు ముగిసేవరకు సోషల్ మీడియాలో ఎలాంటి వీడియోలు చేయకూడదంటూ అర్ష్‌దీప్‌ను గట్టిగా హెచ్చరించినట్లు సమాచారం.

**ఫ్రాంఛైజీ కఠిన నిబంధనలు.. దెబ్బకు దిగొచ్చిన ఆటగాడు?**

ఇదిలా ఉండగానే, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు అర్ష్‌దీప్ పంచుకున్న మరో వీడియో వివాదాన్ని మరింత పెద్దది చేసింది. తోటి ఆటగాడు తిలక్ వర్మ చర్మ రంగును ఉద్దేశిస్తూ 'ఓయ్.. అంధేరా' (చీకటి) అంటూ అర్ష్‌దీప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. జాతివివక్ష పూరిత వ్యాఖ్యల కిందకు ఇవి వస్తాయంటూ నెటిజన్లు అర్ష్‌దీప్‌పై మండిపడ్డారు. ఈ వరుస వివాదాల నేపథ్యంలో పంజాబ్ కింగ్స్ యాజమాన్యం తమ ఆటగాళ్లపై కఠినమైన నిబంధనలు విధించినట్లు వార్తలు వస్తున్నాయి. ఇకపై ఆటగాళ్లు తమ వ్యక్తిగత ఖాతాల నుంచి జట్టుకు సంబంధించిన ఎలాంటి వీడియోలను పోస్ట్ చేయకూడదని, ఏవైనా ఉంటే ఫ్రాంఛైజీ అధికారిక ఖాతాల ద్వారానే విడుదల చేయాలని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ మానసిక ఒత్తిడి వల్లే అర్ష్‌దీప్ తన పాత పోస్టులన్నింటినీ డిలీట్ చేసి ఉంటాడని నెటిజన్లు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఐపీఎల్ 2026 సీజన్లో పంజాబ్ జట్టు ఆరంభంలో అద్భుతంగా రాణించినప్పటికీ, ఆ తర్వాత వరుస ఓటములతో ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే.

# స్పోర్ట్స్

## కార్ల్‌సన్ తొలి రౌండ్‌లోనే.. గుకేశ్, ప్రజ్ఞానంద శుభారంభం..!



నార్వే చెస్ టోర్నీలో తొలిరోజే సంచలనం నమోదైంది. ఫేవరెట్ ఆటగాడైన వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్ కు ఊహించని ఓటమి ఎదురైంది. తొలి రౌండ్‌లోనే అలిరెజా ఫిరౌజా చేతిలో కార్ల్‌సన్ పరాజయం పాలయ్యాడు. ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్ మారథాన్ పోరులో డ్రాతో గట్టెక్కగా, భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అద్భుత పోరాట పటిమతో శుభారంభం చేశాడు. మహిళల విభాగంలో దివ్య దేశ్‌ముఖ్ ధాటికి ఛాంపియన్ జు వెంజున్ చేతులెత్తేసింది. నార్వే చెస్ తొలి రౌండ్‌లో భారత కుర్రాడు గుకేశ్‌కు విన్సెంట్ కెయ్‌మెర్(జర్మనీ) నుంచి గట్టిపోటీ ఎదురైంది. దాదాపు ఐదు గంటల పాటు సాగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి 144 ఎత్తులు వేయడంతో గుకేశ్ చెమటోడ్చక తప్పలేదు. ట్రై బ్రేకర్‌లో పుంజుకున్న భారత స్టార్ 1.5 పాయింట్లు సాధించాడు. పొరపాటుకు భారీ మూల్యం చెల్లించుకున్నాడు. ప్రజ్ఞానంద సైతం ట్రై బ్రేకర్‌లోనే వెస్లేను చిత్తు చేశాడు. ఎదురుదాడి వ్యూహంతో ఆడిన భారత గ్రాండ్‌మాస్టర్ 1.5 పాయింట్లతో గుకేశ్‌తో సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ సంచలన ఆటతో ఛాంపియన్ జు వెంజున్‌కు చెక్ పెట్టింది. ట్రై బ్రేకర్‌లో జోరు చూపించి విజేతగా నిలిచింది.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI** :TEL TEL / 2023/ 84132